ఈనాడు
శ్రీకాకుళం
శనివారం సెప్టెంబరు 28, 2024



కొత్తమ్మతల్లి

శీఘ్రమేవ దర్శన ప్రాప్తిరస్తు..!

- ఆటంకాలు తొలగిస్తే సాఫీగా అమ్మవారి దర్శనం
- 1 నుంచి కొత్తమ్మతల్లి జాతర

న్యూస్‌టుడే, కోటబొమ్మాళి

కోరిన వరాలిచ్చే తల్లిగా... భక్తుల పాలిట కల్పవల్లిగా ప్రసిద్ధికెక్కిన కొత్తమ్మతల్లి ఉత్సవాలను ఈ ఏడాది ప్రభుత్వం రాష్ట్ర పండగగా నిర్వహిస్తోంది.. వచ్చే నెల ఒకటో తేదీ నుంచి మూడు రోజుల పాటు జాతర జరగనుంది. అమ్మదర్శనానికి లక్షల సంఖ్యలో భక్తులు తరలివస్తారు. ఏటా వచ్చేవారికి పలు సమస్యలు ఎదురవుతూనే ఉన్నాయి. క్యూలైన్లు కిక్కిరిసి ఉండటం, నిర్వహణ లోపాలు, కొత్తపేట-కోటబొమ్మాళి ప్రధాన రహదారిపై కిలోమీటర్ల మేర భక్తులకు నిరీక్షణ తప్పట్లేదు. ప్రతిఒక్కరూ ఆటంకాలు లేకుండా అమ్మవారిని దర్శించుకునేలా చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు. వారి సూచనల్లో కొన్ని..

ఇవి చేస్తే మేలు..

- దర్శన క్యూలైన్లలో చిన్నారులు, మహిళలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడకుండా పాలు, తాగునీటి సౌకర్యాలు కల్పించాలి. స్వచ్ఛంద సేవలందించేవారికి అధికారులు తోడ్పాటునివ్వాలి.
- పెద్ద సంఖ్యలో తరలివచ్చే భక్తులతో కిలోమీటర్లు దాటి క్యూలైన్లు ప్రధాన రహదారిపైకి వస్తాయి. ఈ సమయంలో ఎండ ధాటికి భక్తులు ఇబ్బందులు పడతారు. ఎండ నుంచి రక్షణగా టెంట్లు, కింద పరదాలు వేయాలి.
- కోటబొమ్మాళి మార్గంలో ఉన్నదాంతో పాటు కొత్తవైపు కూడా పాదరక్షలు భద్రపరిచేందుకు సౌకర్యం ఏర్పాటు చేయాలి.
- మూడోరోజు (గురువారం) లక్షల్లో జనం వస్తారు. పలువురు గర్భగుడి వద్ద శీఘ్రదర్శనం కోసం రక్షణ గోడలపై నుంచి అవుట్‌గేట్ ద్వారా వస్తున్నారు. దీనివల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వాటిని పరిష్కరిస్తే బాగుంటుంది.
- వీఐపీల పేరుతో నిబంధనలు అతిక్రమించి కొందరు ఆలయంలోకి ప్రవేశిస్తున్నారు. వీరిని పోలీసులు, ఆలయ నిర్వాహకులు వదిలేస్తున్నారు. దీనివల్ల అప్పటికే వేచి ఉన్న భక్తులకు అసౌకర్యం కలగడంతో పాటు ఆదాయానికి గండి కొడుతున్నారు.
- అమ్మవారి గర్భగుడి భక్తులు సమర్పించే ముర్రాటల నీటితో నిండిపోతుంటుంది. వెంటనే తొలగించి, ఆలయ పరిసరాలను పరిశుభ్రం చేసేలా చర్యలు తీసుకోవాలి.
- ఉత్సవాల్లో తప్పిపోయిన వారి ఆచూకీ ఆలయంలో కాక ఆరుబయట ఆలయం ముందు పోలీసు కంట్రోల్‌రూం వద్ద చెప్పేలా ఉంటే మేలు.
- కొత్తపేట నుంచి కోటబొమ్మాళి వైపు ఎర్రన్నాయుడు పార్కు వరకు రహదారిపైకి కాక కొంతమేర లోపలకు తాత్కాలిక దుకాణాలు ఏర్పాటు చేస్తే రద్దీ నియంత్రించవచ్చు.
- వాహనాల పార్కింగ్‌కు, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పోలీసులు ముందుగానే చర్యలు చేపట్టాలి.
- ట్రాఫిక్ నియంత్రణకు ప్రధాన రహదారి కాకుండా కోటబొమ్మాళి-మంచాలపేట రహదారిని ప్రత్యామ్నాయ మార్గంగా పరిశీలించవచ్చు.
- మొదటి రోజు, మూడోరోజు భక్తుల రద్దీ దృష్ట్యా పోలీసుల సంఖ్య మరింత పెంచాలి.
- దేవాదాయశాఖ ఆధ్వర్యంలో ఉచిత ప్రసాదాల కేంద్రాలను రెండు,మూడుచోట్ల పెట్టాలి. అవుట్‌గేట్ వద్ద పెట్టడంతో రద్దీ ఏర్పడుతుంది.
- వచ్చిన భక్తులకు అత్యవసర సమయంలో మరుగుదొడ్లు సరిపడా లేవు. మొబైల్ మరుగుదొడ్లను అందుబాటులోకి తీసుకురావాలి.



దర్శనానికి రహదారిపై బారులు తీరిన భక్తులు (పాతచిత్రం)



సూట్‌కేసులో గంజాయి

గుణపురం-విశాఖ ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలులో నౌపడ వద్ద గురువారం లభ్యమైన సూట్‌కేస్‌ను శుక్రవారం జీఆర్పీ పోలీసులు తెరిచారు. అందులో 13.5 కిలోల గంజాయి ఉన్నట్లు గుర్తించారు. మొత్తం ఆరు ప్యాకెట్లు అందులో ఉన్నాయని, వాటిని ఆర్పీఎఫ్ పోలీసులకు అప్పగించినట్లు ఎస్సై మధుసూదనరావు తెలిపారు. పలాస రైల్వే ఎస్సై షరీఫ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

– న్యూస్‌టుడే, ఆమదాలవలస పట్టణం

కల్తీ కాగుతోంది..!

- యథేచ్ఛగా నాణ్యత లేని నెయ్యి, నూనెల వ్యాపారం
- ప్రజారోగ్యంపై ప్రభావం చూపుతున్నా పట్టించుకోని యంత్రాంగం



– న్యూస్‌టుడే, పాతశ్రీకాకుళం

ప్రస్తుతం ఇంటా బయటా నెయ్యి, నూనెల వినియోగం తప్పనిసరి అయిపోయింది. ఇదే అదనుగా భావించి కొందరు యథేచ్ఛగా వాటిని కల్తీ చేస్తున్నారు. ప్రజల ఆరోగ్యంతో ఆటలాడుకుంటున్నారు. అయినా అధికారులు కన్నెత్తి చూడట్లేదు. సిబ్బంది కొరత ఉందని.. ప్రయోగశాలలు లేవని కుంటిసాకులు చెబుతూ కాలం గడిపేస్తున్నారు. తాజాగా పవిత్రమైన తిరుమల లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీ నెయ్యి వినియోగం అంశం తెరపైకి వచ్చిన తర్వాత మన దగ్గర పరిస్థితి ఏంటనే ప్రశ్న ఉదయిస్తోంది. జిల్లాలోనూ నాణ్యత లేని నెయ్యి, నూనెల వాడకం విచ్చలవిడిగా జరుగుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

అధికశాతం రెండో రకమే..

నెయ్యి రెండు రకాలుగా ఉత్పత్తి చేస్తారు. ఇళ్లలో పెరుగు చిలికే క్రమంలో వచ్చే వెన్నను కాయడం ద్వారా తయారు చేసేది 10 నెలలైనా స్వచ్ఛంగా ఉంటుంది. యంత్రంలో పాలు పోసి ఆడించిన తర్వాత వచ్చే వెన్నను మరిగించి రెండో రకం చేస్తారు. దాని నాణ్యత నెల రోజుల తర్వాత తగ్గిపోతుంది. జిల్లాలో అత్యధికంగా రెండో రకం నెయ్యి అమ్మకాలు, వినియోగమే జరుగుతోంది. అందులోనూ వనస్పతి, పామాయిల్ కలిపేసి కొందరు కల్తీ చేస్తున్నారు. పెద్దఎత్తున కొనుగోలు చేసే మిఠాయిలు, ప్రత్యేక వంటకాల తయారీదారులు కల్తీ సరకుపైనే ఆధారపడుతున్నారు. జిల్లాలో నెలకు సుమారుగా 50 వేల లీటర్ల నెయ్యి విక్రయాలు జరుగుతుంటాయని వ్యాపారవర్గాల అంచనా. రకం, నాణ్యత బట్టి కిలో రూ.350 నుంచి రూ.1,000 వరకు అమ్ముతుండగా.. రూ.2.50 కోట్ల మేర వ్యాపారం అవుతోంది.



ధరే కాదు నాణ్యతా తక్కువే..



జిల్లాలో ఎక్కువగా సన్ ఫ్లవర్, పామాయిల్, రైస్‌బ్రాన్, వేరుశెనగనూనెలను ఎక్కువగా వాడుతుంటారు. అన్నీ కలిపి నెలకు దాదాపుగా 1,700 టన్నుల నూనె విక్రయాలు జరుగుతున్నాయి. అందులో చిన్న, మధ్యతరహా హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ కేంద్రాల్లో అధికంగా పామాయిల్, సన్ ఫ్లవర్ నూనెలనే వాడుతున్నారు. మిగిలిన వాటి కంటే తక్కువ ధరకు లభిస్తుండటంతో ఓ వర్గం వ్యాపారులతో పాటు సామాన్య, మధ్యతరగతి ప్రజలూ వీటికే మొగ్గు చూపుతున్నారు. నెలకు సుమారుగా రూ.15 కోట్ల మేర నూనె అమ్మకాలు జరుగుతున్నట్లు సమాచారం.

వేలల్లో వ్యాపారులు.. ఇద్దరే అధికారులు..

జిల్లా కేంద్రంలోనే తోపుడు బండ్లు, చిన్న, మధ్యతరహా హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ కేంద్రాలు సుమారు వెయ్యి వరకు ఉన్నాయి. 30 మండలాల్లో ఆ సంఖ్య 10 వేల వరకు ఉండొచ్చని అంచనా. నెయ్యి, నూనెల సరఫరాదారులు 500 మంది ఉంటారు. వీరందరి వద్దా కల్తీ జరగకుండా ఇన్‌స్పెక్టర్‌స్థాయి అధికారులు మాత్రం ఇద్దరే కనిపిస్తున్నారు. ఫలితంగా ఎక్కడా తనిఖీలు సవ్యంగా జరగట్లేదు. వ్యాపారులకు అధికారులొస్తారనే భయం కూడా లేకుండా పోయింది.

క్యాన్సర్‌తో పాటు జీర్ణ సమస్యలు..

కల్తీ నెయ్యి, నూనెలతో చేసిన పదార్థాలు తింటే క్యాన్సర్‌తో పాటు జీర్ణకోశ రుగ్మతల బారిన పడే ప్రమాదముంది. వీటికి అదనంగా మలబద్ధకం, ఒళ్లు నొప్పులు, గుండె పోటు, పక్షవాతం వంటి సమస్యలుకూ ఆస్కారం ఏర్పడుతుంది. జీర్ణ వ్యవస్థ గాడి తప్పుతుంది. ఆరోగ్యం పాడయ్యాక రూ.లక్షలు ఖర్చు చేసే బదులు ముందే మేల్కోవడం మంచిది. – వండాన కిరణ్‌కుమార్, వైద్య నిపుణుడు, శ్రీకాకుళం

అనుమానం వస్తే ఫిర్యాదు చేయండి..

నాణ్యమైన నెయ్యి చిన్న పూసల మాదిరిగా ఉండాలి. అలా లేకుంటే నాణ్యత తగ్గినట్లు అనుమానించవచ్చు. ఇలా నూనెతో పాటు ఇతర ఆహార పదార్థాలు కల్తీ అయ్యాయని సందేహం ఉంటే శ్రీకాకుళం నగరం మండల వీధిలోని ఆహార భద్రతా అధికారి కార్యాలయంలో ఫిర్యాదు చేయొచ్చు. వెంటనే నమూనాలను ప్రయోగశాలకు పరీక్షలకు పంపిస్తాం. కల్తీ అని తేలితే చర్యలు తీసుకుంటాం. – కె.వెంకటరత్నం, జిల్లా ఆహార భద్రతాధికారి, శ్రీకాకుళం

ఆహార పదార్థాల కల్తీ ఫిర్యాదులకు సంప్రదించాల్సిన నంబరు: 97040 09989

స్వాభిమాన్‌కు 41 అర్జీలు



సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం అర్బన్, న్యూస్‌టుడే: శ్రీకాకుళం నగరంలోని జడ్పీ సమావేశ మందిరంలో శుక్రవారం విభిన్న ప్రతిభావంతుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 'స్వాభిమాన్' కార్యక్రమంలో 41 అర్జీలు అందాయని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. ఇందులో భాగంగా ఆయన మాట్లాడుతూ సదరం ధ్రువపత్రాల సమస్యలు ఎక్కువగా ఉన్నాయన్నారు. వాటిని పరిష్కరించడానికి సీనియర్ వైద్యులతో కూడిన బృందాలను ఏర్పాటు చేసి ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ దివ్యాంగులకు నిర్వహించిన ఉపాధి మేళాలో ఎంపికైన వారికి కలెక్టర్ నియామక పత్రాలు అందజేశారు. జడ్పీ సీఈవో ఆర్.వెంకట్రామన్, డీపీవో వెంకటేశ్వరరావు, డీఎంహెచ్‌వో బి.మీనాక్షి, డీసీహెచ్ఎస్ కల్యాణ్‌బాబు, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకురాలు కె.కవిత పాల్గొన్నారు.



శ్రీజగన్నాథపురం పెద్దవీధిలో వరద నీరు

ఆక్రమణల దెబ్బకి ఊరు ఏరైంది..!



ఉమిలాడలో చెరువును తలపిస్తున్న గ్రామ సచివాలయ పరిసరాలు

రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు సంతబొమ్మాళి మండలంలోని పలు గ్రామాలు నీటమునిగాయి. కాలువల కోసం గుంతలు తవ్వి నిర్మించకుండా వదిలేయడం, వరద నీరు వెళ్లే మార్గాలను పలువురు ఆక్రమించడంతో జగన్నాథపురం గ్రామంలోని పెద్దవీధి జలదిగ్బంధంలో చిక్కుకుంది. పలు వీధుల్లో నాలుగు గంటల పాటు నీరు ఏరులా పారడంతో స్థానికులు బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. మాజీ సర్పంచి పుక్కళ్ల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పొక్లెయిన్‌తో వరద నీరు మళ్లింపు చర్యలు చేపట్టారు. ఉమిలాడలో గ్రామ సచివాలయం, హెల్త్ క్లినిక్, పాఠశాల భవనాల చుట్టూ వరద నీరు చేరింది. స్థానికులు, ఉద్యోగులు ఇక్కట్లు ఎదుర్కొన్నారు. – న్యూస్‌టుడే, సంతబొమ్మాళి

రెవెన్యూశాఖలో బదిలీలు

కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: జిల్లా రెవెన్యూశాఖలో బదిలీల ప్రక్రియ కొనసాగుతోంది. శుక్రవారం ఉదయం మూడు విభాగాలకు చెందిన జాబితాను అధికారులు విడుదల చేశారు. నలుగురు టైపిస్టులు, అయిదుగురు కంప్యూటర్ సహాయకులు, 22 మంది జూనియర్ సహాయకులకు స్థానచలనం కల్పించారు. తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, వీఆర్వోలు, సీనియర్ సహాయకులకు ఇంకా బదిలీలు జరగాల్సి ఉంది. ప్రక్రియలో తీవ్ర జాప్యం జరుగుతోందని ఉద్యోగులు చర్చించుకుంటున్నారు.

బీఆర్ఏయూలో గాంధీయన్ సోషల్ వర్క్ పీజీ డిప్లొమా కోర్సు

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: డా. బి.ఆర్.అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో సోషల్ వర్క్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పీజీ డిప్లొమా ఇన్ గాంధీయన్ సోషల్‌వర్క్ కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వర్సిటీ రిజిస్ట్రార్ పీలా సుజాత శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏడాది కాల వ్యవధి గల ఈ కోర్సులో చేరేందుకు ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన వారు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు రూ.200 రుసుం ఆన్‌లైన్‌లో చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈ కోర్సులో చేరిన విద్యార్థులు ఏడాదికి రూ.2,500 ట్యూషన్ రుసుం చెల్లించాలని పేర్కొన్నారు. అక్టోబరు 5వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు వర్సిటీ వెబ్‌సైట్ www.drbrau.edu.in కాని, సోషల్‌వర్క్ విభాగాధిపతి డా. యు.కావ్యజ్యోత్స్న, 94945 20417, 63045 20703 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

పనులయ్యే వరకు పద్మవ్యూహం తప్పదా..!

జనానికి నరకం చూపిస్తున్న శ్రీకాకుళం - ఆమదాలవలస రోడ్డు

– ఈనాడు డిజిటల్ శ్రీకాకుళం, న్యూస్‌టుడే, కలెక్టరేట్, ఆమదాలవలస గ్రామీణం

శ్రీకాకుళం- ఆమదాలవలస రోడ్డు పేరెత్తితేనే ప్రయాణికులు బెంబేలెత్తిపోతున్నారు. వైకాపా ఐదేళ్ల పాలన నిర్వాకంతో ప్రజలు ఇప్పటికీ అధ్వాన మార్గంలో అష్టకష్టాలు పడుతున్నారు. గుంతలదారిలో నిత్యం నరకం చూస్తున్నారు. ఇటీవల కొత్త సమస్య నెత్తిన పడింది. తరచూ వాహనాలు మట్టిలో కూరుకుపోతుండటంతో రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయి. శుక్రవారం కొత్తరోడ్డు వద్ద ఓ కారు టైరు మట్టిలో దిగబడిపోవడంతో వెనుకున్న రెండు లారీలు నిలిచిపోయాయి. సుమారు రెండు గంటలకుపైగా మూడు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. రహదారి పనులు పూర్తయ్యే వరకు పాట్లు తప్పవేమోనంటూ ప్రయాణికులు అసహనం వ్యక్తం చేశారు.

ఈ రహదారి అభివృద్ధికి 2018లో అప్పటి తెదేపా ప్రభుత్వం రూ.37 కోట్లు కేంద్ర నిధులు మంజూరు చేసింది. కొంతమేర భూసేకరణ జరిపి 20 శాతం పనులూ చేపట్టింది. ఇంతలో ప్రభుత్వం మారింది. వైకాపా అధికారంలోకి వీటి గురించి పట్టించుకోలేదు. గుత్తేదారుకు చెల్లించాల్సిన రూ.14 కోట్లు బకాయిల సంగతి పట్టించుకోకపోవడంతో పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. అడుగడుగునా గుంతలతో దారంతా అధ్వానంగా తయారైంది. రోడ్డు ప్రమాదాలకు గురై ఐదేళ్లలో 17 మంది ప్రాణాలు కోల్పోయారు. ఎంతో మంది తీవ్రంగా గాయపడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత స్థానిక ఎమ్మెల్యేలు గుత్తేదారుతో మాట్లాడారు. బకాయిలు చెల్లించే బాధ్యత తమదని భరోసా ఇవ్వడంతో ఎట్టకేలకు పనులు పునఃప్రారంభమయ్యాయి.



కొత్తరోడ్డు వద్ద మట్టిలో దిగబడిన కారు, నిలిచిన ట్రాఫిక్

భారీ వాహనాలతోనే ఇక్కట్లు..

ఈ మార్గంలో నిత్యం భారీ వాహనాలు పెద్ద సంఖ్యలో వస్తుండటంతో సమస్యలు తలెత్తుతున్నాయి. కొన్ని రోజుల కిందట మూడు లారీలు రాగోలు వద్ద మట్టిలో కూరుకుపోవడంతో ఇతర వాహనాలు చాలాసేపు నిలిచిపోయాయి. పనులు పూర్తయ్యే వరకు భారీ వాహనాలను దారి మళ్లిస్తే బాగుంటుందని నిపుణులు సూచిస్తున్నారు. అవి రావడంతో పనులు వేగవంతంగా జరగకపోవడంతో పాటు వేసిన రోడ్డు సైతం ధ్వంసమయ్యే అవకాశముందని హెచ్చరిస్తున్నారు.

పూర్తయింది..

మొత్తం 10.4 కిలోమీటర్ల మేర ఈ రహదారిని విస్తరించాల్సి ఉండగా.. ఆమదాలవలస నుంచి రాగోలు శివారు వరకు గతంలో 4.5 కి.మీ. పనులు పూర్తి చేశారు. ఇటీవల రాగోలు పరిధిలో 750 మీటర్ల వరకు తారు రోడ్డు వేశారు.

కావాల్సింది..

రాగోలు-కొత్తరోడ్డు, అక్కడి నుంచి శ్రీకాకుళం నగరంలోని డై అండ్ నైట్ కూడలి వరకు సుమారు 5 కి.మీ. వరకు రోడ్డు నిర్మాణం చేపట్టాల్సి ఉంది. దానికి సంబంధించి రూ.19.05 కోట్లు నష్ట పరిహారం చెల్లించేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. ఇంకా డివైడర్లు, కల్వర్టులు, కాలువలూ ఏర్పాటు చేయాల్సి ఉంది.



వేగవంతం చేస్తాం..

ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం శ్రీకాకుళం - ఆమదాలవలస రహదారి పనులు పూర్తి చేసేందుకు కట్టుబడి ఉన్నాం. రాగోలు పరిధిలో పనులు జరుగుతున్నాయి. వర్షాలు తగ్గుముఖం పట్టిన వెంటనే వేగవంతం చేస్తాం. ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలపై ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లాం. త్వరలో నిధులు మంజూరవుతాయి. గుత్తేదారుకి అన్ని విధాలా సహకరిస్తున్నాం. – కూన రవికుమార్, గొండు శంకర్, ఆమదాలవలస, శ్రీకాకుళం ఎమ్మెల్యేలు

నేడు మన ఇల్లు - మన గౌరవం

శ్రీకాకుళం నగరం, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు జిల్లాలో శనివారం మన ఇల్లు-మన గౌరవం కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. ఈ విషయమై శుక్రవారం జిల్లా, మండల స్థాయి అధికారులతో దూరదృశ్య సమీక్ష నిర్వహించారు. ప్రతి శనివారం లేఅవుట్లలో లబ్ధిదారులతో సమావేశం నిర్వహించి ఇళ్ల నిర్మాణాలపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. ఇళ్ల నిర్మాణాల వేగవంతానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.



ఏడుగురు విద్యార్థులు.. ఉపాధ్యాయులు!

– న్యూస్‌టుడే సోంపేట, కంచిలి గ్రామీణం

గత ప్రభుత్వం అమలు చేసిన విధానాలతో కొన్ని పాఠశాలలు అస్తవ్యస్తంగా నడుస్తున్నాయి. కంచిలి మండలం పి.కొజ్జిరియాలో ఒకే ప్రాంగణంలో నిర్వహిస్తున్న ప్రాథమిక, ఉన్నత పాఠశాలల పరిస్థితి అధ్వానంగా మారింది. ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సంఖ్య క్రమేపీ తగ్గి ప్రస్తుతానికి ఏడుగురే చదువుకుంటున్నారు. 3 నుంచి 10 వరకు ఎనిమిది తరగతులు నిర్వహిస్తుండగా నాలుగు తరగతుల్లోనే విద్యార్థులు చేరారు. మూడులో ఒకరు, నాలుగులో ఇద్దరు, ఆరులో ఒకరు, ఏడో తరగతిలో ముగ్గురు విద్యార్థులున్నారు. వీరి కోసం ఏడుగురు స్కూల్ అసిస్టెంట్లు పని చేస్తున్నారు. ఆంగ్లం, గణితం సబ్జెక్టులకు సంబంధించి ఇద్దరేసి ఉండగా తెలుగు, భౌతిక, సాంఘికశాస్త్రం బోధించడానికి ఒకొక్కరు చొప్పున పని చేస్తున్నారు.

ఇక్కడ ఇద్దరికి ఒకరు..


విలీనంలో భాగంగా రెండేళ్ల కిందట ప్రాథమిక బడుల్లో 3 నుంచి 5 తరగతుల విద్యార్థులను ఉన్నత పాఠశాలలకు పంపారు. ఈ క్రమంలో ప్రాథమిక పాఠశాల మూతపడే స్థితికి చేరింది. ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఒకటో తరగతిలో ఒక్కరూ చేరలేదు. రెండో తరగతిలో ఇద్దరు పిల్లలు మాత్రమే మిగిలారు. వారి కోసం ఓ ఎస్జీటీ విధులు నిర్వహిస్తున్నారు. వంట ఏజెన్సీ, పారిశుద్ధ్య సిబ్బంది, ఉపాధ్యాయులకు జీతభత్యాల రూపంలో రూ.7 లక్షలకు పైగా ఖర్చవుతోంది. విద్యా సంవత్సరం ప్రారంభమై నాలుగు నెలలు గడిచినా ఆ శాఖ అధికారులు ఈ పాఠశాల పరిస్థితిపై సమీక్షించలేదు. ఈ పాఠశాలల నిర్వహణ విషయంలో ప్రభుత్వం సరైన నిర్ణయం తీసుకుని చక్కదిద్దేలా చర్యలు తీసుకోవాలని విద్యావేత్తలు కోరుతున్నారు. పి.కొజ్జిరియాలో పాఠశాలల పరిస్థితిపై డీఈవో తిరుమల చైతన్యను 'న్యూస్‌టుడే' సంప్రదించగా ప్రభుత్వం త్వరలో నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు.



ఏడో తరగతిలో ముగ్గురు విద్యార్థులే



ఆరో తరగతిలో ఒక్కరే..



తప్పిన ప్రమాదం



రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు సంతబొమ్మాళి మండలం ఇజ్జువరం పంచాయతీ రాజగోపాలపురం గ్రామానికి చెందిన సీది అప్పారావు ఇంటి గోడ అకాల వర్షాలకు కూలిపోయింది. ఆ సమయంలో అక్కడ ఎవరు లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. అధికారులు స్పందించి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని మాజీ సర్పంచి బి.సత్యనారాయణ కోరారు. - న్యూస్‌టుడే, సంతబొమ్మాళి

కూలిన చెట్టు..

టెక్కలి- నౌపడా మార్గంలో విశ్వనాథపురం గ్రామ కూడలివద్ద శుక్రవారం ఉదయం ఓ భారీ వృక్షం రహదారికి అడ్డంగా కూలింది. నిత్యం రద్దీగా ఉండే ఈ మార్గంలో ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. చెట్టు కూలిపోవడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. స్పందించిన అధికారులు యంత్రం సాయంతో చెట్టును పక్కకు తొలగించారు. - న్యూస్‌టుడే, టెక్కలి పట్టణం



కొండచిలువలు హల్‌చల్

గార, న్యూస్‌టుడే: మండల హుకుంపేట, బూరవల్లి గ్రామాల్లో గురువారం రాత్రి కొండచిలువలు హల్‌చల్ చేయడంతో స్థానికులు భయాందోళనలకు గురయ్యారు. వమరవల్లి పంచాయతీ హుకుంపేట గ్రామస్థులు చేపలు పట్టడానికి సమీపంలోని పంట కాలువలో వేసిన వలకు 7 అడుగుల పొడవున్న కొండచిలువ చిక్కింది. స్థానికులు దీన్ని హతమార్చారు. బూరవల్లికి చెందిన రమణ ఇంట్లోకి ప్రవేశించిన 10 అడుగుల పొడవున్న కొండచిలువను స్థానికులు చంపేశారు.



హుకుంపేటలో హతమార్చిన కొండచిలువ

ప్రసాదాల తయారీ కేంద్రంలో తనిఖీలు

శ్రీకాకుళం నగరం, న్యూస్‌టుడే: అరసవల్లిలోని సూర్యనారాయణస్వామి ఆలయంలో లడ్డూలు, పులిహోర, అన్నప్రసాదం తయారీ కేంద్రాన్ని శుక్రవారం జిల్లా ఆహార కల్తీ నియంత్రణ అధికారి కె.వెంకటరత్నం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా లడ్డూ, పులిహోర, ఆహారం తయారీకి ఉపయోగిస్తున్న సరకుల నాణ్యతను పరిశీలించారు. తయారీ కేంద్రంలో శుభ్రత, సిబ్బంది తీసుకోవలసిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. వంటశాల, పాత్రలను శుభ్రంగా ఉంచుకోవాలని. . అన్నదాన కేంద్రంలో భక్తులకు రక్షిత తాగునీరు అందించాలని ఆదేశించారు. సరకులను శుభ్రమైన ప్రాంతంలో నిబంధనల మేరకు నిల్వ చేయాలని స్పష్టం చేశారు. సరకుల నాణ్యతను పరిశీలించడానికి కొన్ని నమూనాలను ప్రయోగశాలకు పంపుతున్నట్లు తెలిపారు. ఆహార కల్తీ నియంత్రణ సహాయ అధికారిణి లక్ష్మి పాల్గొన్నారు.



ప్రసాదాలను పరిశీలిస్తున్న ఆహార కల్తీ నియంత్రణాధికారి వెంకటరత్నం

ఇసుక అక్రమ రవాణాకు అడ్డొస్తున్నానని దాడి


బూర్జ, న్యూస్‌టుడే: 'ఇసుక అక్రమ రవాణాకు అడ్డొస్తున్నానని ఆమదాలవలస ఎమ్మెల్యే అనుచరులు నాపై దాడికి పాల్పడ్డారు' అని బూర్జ మండలం గుత్తావిల్లికి చెందిన సనపల సురేష్‌కుమార్ ఆరోపణలు సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేసిన వీడియో వైరల్ అయ్యింది. అందులో ఆయన మాట్లాడిన వివరాల మేరకు 'కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనంతరం కాఖండ్యాం నుంచి ఇసుక అక్రమ రవాణా అవుతోంది. ఉచిత ఇసుక విధానం ప్రవేశపెట్టిన తర్వాత ఒక డీడీపై ఒకటి కంటే ఎక్కువ వాహనాలు తరలిపోతున్నాయని ఆగస్టులో కలెక్టరు, ఎస్పీలకు ఫిర్యాదు చేశాను. వారు కమిటీని నియమించి అక్రమ రవాణా జరగకుండా నియంత్రించారు. ఈ నేపథ్యంలో కొందరు కక్ష పెంచుకుని కులాల పేరిట దూషించాని శుక్రవారం నారాయణపురం వద్ద ఎమ్మెల్యే కూన రవికుమార్ అనుచరులు కె.గోవిందరావు, రమేష్, సురేష్, సీహెచ్ బాలకృష్ణ, కె.విష్ణు, మరికొందరు నాపై దాడి చేసి గాయపరిచారు. మెడలో బంగారు గొలుసు, కొంత నగదు లాక్కున్నారు. ఎమ్మెల్యే ప్రోద్బలంతోనే ఈ దాడి జరిగింది. నాకు ప్రాణహాని ఉందని రక్షణ కల్పించాలని దృష్టికి తీసుకెళ్లాను. శ్రీకాకుళంలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాను' అని పేర్కొన్నారు. ఈ విషయమై ఎస్సై ఎం.ప్రవల్లికను సంప్రదించగా సురేష్‌కుమార్‌పై, నలుగురు నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



శ్రీకాకుళంలోని ప్రభుత్వ సర్వజనాసుపత్రిలో చికిత్స పొందుతున్న సనపల సురేష్‌కుమార్

సీఎం దృష్టికి సమస్యలు

విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని పరిస్థితులను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడి దృష్టికి తీసుకెళ్లారు. శుక్రవారం అమరావతిలోని సచివాలయంలో ముఖ్యమంత్రిని ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. రెండు జిల్లాలోని సమస్యలు, ఇతర అంశాలు, ఇటీవల వరదల కారణంగా ఏర్పడిన నష్టాలను సీఎంకు వివరించినట్లు కలిశెట్టి తెలిపారు. – న్యూస్‌టుడే, ఎచ్చెర్ల



చిట్టి చేతులు.. చక్కటి ఆకృతులు!

సారవకోట, న్యూస్‌టుడే

నిత్యం పుస్తకాలతో కుస్తీ పట్టే విద్యార్థులు తమలో దాగి ఉన్న కళా నైపుణ్యాన్ని వెలుగులోకి తెస్తున్నారు. ఒకరికొకరు పోటీపడి అబ్బురపరిచే ఆకృతులు తీర్చిదిద్దుతున్నారు. ఆకర్షణీయమైన వస్తువులు, పరికరాలు తయారు చేస్తున్నారు. సారవకోట మండలం బుడితి ఉన్నత పాఠశాల విద్యార్థుల కళా ప్రదర్శనపై 'న్యూస్‌టుడే' కథనం.



విద్యార్థులు తయారుచేసిన ఆకృతుల్లో కొన్ని

ఈ పాఠశాలలో 460 మంది విద్యార్థులు చదువుతున్నారు. పదేళ్ల నుంచి క్రాఫ్ట్ ఉపాధ్యాయుడిగా ఎర్ర ఆనందరావు పని చేస్తున్నారు. పిల్లలకు వివిధ ఆకృతులతో అల్లికలు, బొమ్మలు, పూల దండల తయారీ నేర్పిస్తున్నారు. భవిష్యత్తులో ఉపాధి లభించే విధంగా తర్ఫీదు ఇస్తున్నారు. ఈ ఏడాది జిల్లా కేంద్రంలో నిర్వహించిన స్వాతంత్ర్య వేడుకల్లో ఏర్పాటు చేసిన ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ స్టాల్‌లో ఇక్కడి విద్యార్థులు తయారు చేసిన పలు రకాల బొమ్మలు, పూలదండలు, పుష్పగుచ్ఛాలు వంటివి ఉంచారు. గోధుమ పిండి, కాగితాలు, తీగలు వినియోగించి తయారు చేసిన దుప్పి బొమ్మకు రంగులు వేసి ప్రదర్శనలో ఉంచారు. ఈ బొమ్మతో పాటు ఈఫిల్ టవర్, అయోధ్య రామ మందిరం వంటివి సందర్శకులను ఆకట్టుకున్నాయి.

పట్టు సాధించారు..

6 నుంచి 8వ తరగతి విద్యార్థులకు బొమ్మల తయారీ, అల్లికలు నేర్పిస్తున్నాను. ఇప్పటికే చాలా మంది పట్టు సాధించారు. ప్రస్తుతం చదువుతున్న విద్యార్థుల్లో 70 మంది వరకు అవలీలగా తయారు చేస్తున్నారు. కొందరు ఇళ్లలో తయారు చేసి సొంతానికి వినియోగిస్తుండగా.. మరికొందరు విక్రయిస్తున్నారు. పాఠశాలలో తయారు చేసిన విగ్రహాలు, బొమ్మలు ఉపాధ్యాయులు, విద్యార్థులు కొనుగోలు చేస్తుంటారు. వచ్చిన మొత్తాన్ని తిరిగి బొమ్మల తయారీకి పెట్టుబడిగా వినియోగిస్తుంటాం. పాఠశాల విద్యార్థులు స్వాతంత్ర్య దినోత్సవం నాడు శ్రీకాకుళంలో ఇచ్చిన ప్రదర్శన ఆకట్టుకుంది. నాకు ఉత్తమ క్రాఫ్ట్ ఉపాధ్యాయుడిగా గుర్తించి డీఈవో ప్రశంసాపత్రం అందజేశారు.
– ఎర్ర ఆనందరావు, క్రాఫ్ట్ ఉపాధ్యాయుడు



బొమ్మల తయారీ నేర్పిస్తున్న ఉపాధ్యాయుడు ఆనందరావు

వ్యర్థాలతో రూపకల్పన..

పనికి రాని వస్తువులు, కాగితాలు, వస్త్రాలు, తీగలు, వెదురు, చీపురు పుల్లలు, దూది, అట్టలు, ఊలు, గోధుమ, బియ్యం గింజలు వంటివి ఉపయోగించి బొమ్మలు, గిఫ్ట్ ఆర్టికల్స్, పూలకుండీలు, దీపపు కాంతులతో ఈఫిల్ టవర్, క్రిస్మస్ తాత, వాల్ హ్యాంగర్లు, ఏంజిల్ బొమ్మ, పూలదండలు, రాఖీలు, పుష్పగుచ్ఛాలు, చెవి రింగులు, గృహ అలంకార వస్తువులు, పెన్సిల్ తొక్కుతో నెమలి, చిలుక వంటి పక్షుల తయారీ నేర్పిస్తున్నారు. చీపురు పుల్లలతో గణపతి చిత్రాన్ని రూపొందించారు. దారపు ఉండల్లో ఉండే కాగితపు రోల్స్‌ను ఉపయోగించి అయోధ్య రామ మందిరాన్ని తయారు చేశారు. మట్టితో 50 వరకు వినాయక విగ్రహాలు తీర్చిదిద్దారు. ఒక్కొటి రూ.10 చొప్పున విక్రయించారు. రాఖీలూ అమ్మారు. ఆలయాలు, దుకాణాల అలంకరణలకు దండలు తయారు చేయించి విక్రయించేలా చేస్తున్నారు. తద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందిస్తున్నారు.



బొమ్మలు తయారు చేస్తా..

మూడేళ్లుగా బొమ్మల తయారీ నేర్చుకున్నా. ఎలాంటి బొమ్మనైనా తయారు చేయగలనన్న నమ్మకం కలిగింది. తీరిక సమయంలో ఈ పని చేస్తుంటా. బంధువులు, సమీపంలో ఉంటున్న వారు వారి ఇళ్లకు తీసుకెళ్తుంటారు. నా దగ్గర బొమ్మల తయారీ నేర్చుకోవడానికి గ్రామానికి చెందిన కొందరు ఆసక్తి కనబరచడం ఆనందాన్నిస్తోంది.
– రామకృష్ణ, విద్యార్థి, చీడిపూడి

అబ్బురపరుస్తున్నాయి..

విద్యార్థులు తయారు చేస్తున్న బొమ్మలు, వస్తువులు అబ్బురపరుస్తున్నాయి. ఉపాధ్యాయుడు ఆనందరావుకు క్రాఫ్ట్ విభాగంలో జిల్లాలో ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం దక్కడం ఆనందాన్ని కలిగించింది. పత్తితో ఒత్తుల తయారీ నేర్పించి టోకుగా విక్రయించాలని నిర్ణయించాం. – బి.మాధవరావు, హెచ్‌ఎం ఉన్నత పాఠశాల, బుడితి

ఈపీడీసీఎల్ ఈఈగా యోగేశ్వరరావు

గుజరాతీపేట(శ్రీకాకుళం)న్యూస్‌టుడే: తూర్పు ప్రాంత విద్యుత్తు పంపిణీ సంస్థ (ఈపీడీసీఎల్) కార్యనిర్వాహక ఇంజినీరుగా పైడి యోగేశ్వరరావు నియమితులయ్యారు. పలాసలో ఈఈగా పని చేసిన ఆయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఎస్ఈ కార్యాలయంలోని ఆయన ఛాంబరులో శుక్రవారం ప్రస్తుత ఈఈ బయ్యన్నాయుడి నుంచి బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఎస్ఈ నాగిరెడ్డి కృష్ణమూర్తిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈఈని వివిధ విభాగాలకు చెందిన ఇంజినీర్లు, సిబ్బంది కలిసి అభినందించారు. ❖ ఈపీడీసీఎల్ శ్రీకాకుళం సర్కిల్ విజిలెన్స్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా కూన విజయనాథ్ నియమితులయ్యారు. విజయనగరంలో పని చేస్తున్న ఆయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఎస్ఈ కార్యాలయంలోని ఆయన ఛాంబరులో శుక్రవారం బాధ్యతలు చేపట్టారు.



యోగేశ్వరరావును అభినందిస్తున్న సిబ్బంది



విజిలెన్స్ సీఐ విజయనాథ్

కేజీబీవీల్లో ఖాళీల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాకుళం నగరం, న్యూస్‌టుడే: జిల్లాలోని కస్తూర్బాగాంధీ విద్యాలయాల్లో (కేజీబీవీ) ఖాళీగా ఉన్న బోధన సిబ్బంది పోస్టుల భర్తీకి అర్హత గల మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సమగ్ర శిక్షా అదనపు ప్రాజెక్టు సమన్వయకర్త ఎస్.తిరుమల చైతన్య శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరంలో పీజీటీ 3, సీఆర్టీ 13, సంక్షేమాధికారి 3, పార్ట్‌టైం ఉపాధ్యాయినులు 16 అకౌంటెంట్ 3 పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఓపెన్ కేటగిరిలో 18-42 సంవత్సరాలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీలకు 5 సంవత్సరాలు, మాజీ సైనికులకు 3 సంవత్సరాలు, దివ్యాంగులకు 10 సంవత్సరాలు వయో పరిమితి సడలింపు ఉన్నట్లు పేర్కొన్నారు. వచ్చే నెల 10 లోగా apkgbv.apcfss.inలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

శ్రీకాకుళం అర్బన్, న్యూస్‌టుడే: జాతీయ స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు జిల్లా నుంచి ఐదుగురు క్రీడాకారులు ఎంపికయ్యారని జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఇంజరాపు భాస్కరరావు, కొత్తకోట శ్రీనివాసరావు తెలిపారు. ఇటీవల అనకాపల్లిలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో పలువురు పతకాలు సాధించిన విషయం విదితమే. వీరిలో జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించిన క్రీడాకారుల జాబితాను రాష్ట్ర వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ వెల్లడించింది. పురుషులు 81 కిలోల కేటగిరీ విభాగంలో ముద్దాడ తరుణ్ (పెద్దపాడు), 102 కిలోల కేటగిరీలో జి.సునీల్ (పాలకొండ), మహిళలు 55 కిలోల కేటగిరీలో దూబ హేమశ్రీ (బూరవల్లి), యూత్ కేటగిరీలో గుజ్జల వర్షిత (ఆడవరం), 64 కిలోల కేటగిరీలో గార లలిత (పాలకొండ) ఎంపికయ్యారు. వచ్చే నెల 6 నుంచి హిమాచల్‌ప్రదేశ్‌లో నిర్వహించనున్న జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారు. క్రీడాకారులను డీఎస్ఏ వెయిట్ లిఫ్టింగ్ శిక్షకుడు, రిఫరీ ఇప్పిలి అప్పన్న, కె.మధుసూదనరావు అభినందించారు.



క్రీడాకారులను అభినందిస్తున్న డీఎస్ఏ వెయిట్ లిఫ్టింగ్ శిక్షకుడు ఇప్పిలి అప్పన్న, మధుసూదనరావు

డ్వామా పీడీ బాధ్యతల స్వీకరణ

శ్రీకాకుళం నగరం, న్యూస్‌టుడే: జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) ప్రాజెక్టు డైరెక్టర్ (పీడీ)గా బి.సుధాకర్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. విజయనగరం మెప్మా పీడీగా పని చేస్తున్న ఆయన్ను ప్రభుత్వం శ్రీకాకుళం డ్వామా పీడీగా ఇటీవల బదిలీ చేసింది. గతంలో పీడీగా పని చేసిన చిట్టిరాజు స్థానంలో బాధ్యతలు చేపట్టారు.



సుధాకర్

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	130	215	235

ఆర్టీసీ ఒకటో డిపో డీఎంగా అమరశివుడు

శ్రీకాకుళం నేరవార్తావిభాగం, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ ఒకటో డిపో డీఎంగా అమరశివుడు నియమితులయ్యారు. ప్రస్తుతం ఆయన విశాఖపట్నం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజరుగా విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పటివరకు డీఎంగా పని చేసిన మల్లికార్జునరాజుకు విశాఖపట్నం అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజరుగా బదిలీ అయ్యారు. పరమశివుడు శ్రీకాకుళంలో 1997 నుంచి 2007 వరకు శ్రీకాకుళం ఒకటో డిపోలో, 2013 నుంచి 2016 వరకు రెండో డిపోలో ఎస్టీఐ, టీఐ-2, సీఐగా పని చేశారు.



కొత్తపేటలో చోరీల కలకలం

కోటబొమ్మాళి, న్యూస్‌టుడే: కోటబొమ్మాళి- కొత్తపేట సర్వీసు రహదారిలోని తారకరామాకాలనీలో గురువారం రాత్రి చోరీలు కలకలం సృష్టించాయి. కాలనీకు చెందిన దాట్ల కళావతి, దుక్క తారకేశ్వరరావు గృహాల్లో చెరో రెండున్నర తులాల బంగారు ఆభరణాలు గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లినట్లు పోలీసులు చెప్పారు. ఎస్ఐ సత్యనారాయణ తెలిపిన వివరాల మేరకు తారకేశ్వరరావు తండ్రి ఇటీవల మృతి చెందడంతో అదే ప్రాంతంలో మరో ఇంట్లో ఉంటున్నారు. కళావతి గత కొద్దిరోజులుగా స్థానికంగా లేకపోవడంతో రెండు చోట్ల ఎవరూ లేని విషయాన్ని గుర్తించిన దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఘటనలో వెండి వస్తువులు సైతం తస్కరించినట్లు బాధితులు పేర్కొన్నారు. క్లూస్‌టీం సభ్యులు ఆధారాలు సేకరించారు. కేసులు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

సర్వజనాసుపత్రిలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

గుజరాతీపేట(శ్రీకాకుళం)న్యూస్‌టుడే: శ్రీకాకుళం నగరంలోని ప్రభుత్వ సర్వజనాసుపత్రి మూడో అంతస్తు వరండాలో శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందారు. కొంతకాలంగా అతను ఇక్కడ నిద్రిస్తున్నట్లు భద్రతా సిబ్బంది తెలిపారు. 15 మందికి పైగా రాత్రి వేళ ఇక్కడికి వస్తున్నట్లు చెప్పారు. గుర్తు తెలియని వ్యక్తి మృతి సమాచారాన్ని వారు రెండో పట్టణ పోలీసుల దృష్టికి తీసుకెళ్లగా పరిశీలించారు. రాత్రి విధుల్లో ఉన్న భద్రతా సిబ్బంది నుంచి సమాచారం సేకరించి ఆయన పేరు ఎఫ్ఐఆర్‌లో చేర్చారు. ఆగ్రహానికి గురైన గార్డులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు 'న్యూస్‌టుడే'తో మాట్లాడారు. రాత్రి వేళ నిద్రించడానికి వచ్చే వారిని బయటకు పంపితే వాదనకు దిగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మృతి చెందితే తమను బాధ్యులను చేయడం సరికాదని వాపోయారు. ఆర్ఎంవో కలగజేసుకుని సర్దిచెప్పడంతో విధులకు హాజరయ్యారు.

దివ్యాంగుడి ఆత్మహత్య

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: మండలంలోని పొన్నాడ పంచాయతీ కమ్మపేట గ్రామానికి చెందిన బాడాన గోవిందరావు(48) జీవితంపై విరక్తి చెంది గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎచ్చెర్ల పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దివ్యాంగుడైన గోవిందరావు శరీర భాగాల్లో నొప్పులు భరించలేక గురువారం గడ్డి మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే శ్రీకాకుళంలోని సర్వజనాసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. ఈయనకు భార్య వైకుంఠంతో పాటు ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎచ్చెర్ల ఎస్సై వి.సందీప్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బంగారం మాయం కేసులో దర్యాప్తు వేగవంతం

శ్రీకాకుళం నేరవార్తావిభాగం, న్యూస్‌టుడే: స్టేట్‌బ్యాంకు గార శాఖలో బంగారం మాయం కేసు దర్యాప్తును వేగవంతం చేశారు. శ్రీకాకుళం డీఎస్పీ వివేకానంద ఆధ్వర్యంలో పోలీసు బృందం ఈ కేసుతో సంబంధం ఉండి తప్పించుకున్నారని అనుమానిస్తున్న కీలక ప్రతినిధులు, అప్పుడు బ్యాంకులో పని చేసిన సుమారు 15 మంది నుంచి వివరాలు ఆరా తీస్తున్నారు. వారిలో ఆడిటర్లు, మేనేజర్లు ఉన్నారు. కొందరి వద్ద స్టేట్‌మెంట్లు తీసుకుంటున్నారు. ఈ ప్రక్రియ వేగవంతం అయినప్పటి నుంచి ఆర్ఎంను బయటకు పంపకుండా దర్యాప్తు సాగిస్తున్నారు.

పాచిపెంటలో గంజాయి పట్టివేత

పాచిపెంట, న్యూస్‌టుడే: ఒడిశా నుంచి అక్రమంగా తరలిస్తున్న గంజాయిని శుక్రవారం స్వాధీనం చేసుకున్నట్లు పాచిపెంట ఎస్సై వెంకటసురేష్ తెలిపారు. ఆయన వివరాల మేరకు.. శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఆవల అనిల్, అతని స్నేహితుడు భరతుడుతో కలిసి ద్విచక్ర వాహనంపై కిలో గంజాయి తరలిస్తూ మండలంలోని పి.కోనవలస చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీలో పట్టుబడ్డారు. ఒడిశా రాష్ట్రంలోని సుంకిలో గంజాయి కొనుగోలు చేశామని వారు అంగీకరించారు. సరకు, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి ఇద్దరినీ అరెస్టు చేసినట్లు ఎస్సై తెలిపారు.

సమస్య : ఇచ్ఛాపురం ఆసుపత్రిరోడ్డు రహదారి శిథిలమై ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. - వి.కుమారస్వామి, ఇచ్ఛాపురం
సమాధానం : రహదారి అభివృద్ధికి చర్యలు తీసుకుంటాం. - రమేష్, కమిషనర్, ఇచ్ఛాపురం – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

? పలాస మండలం రెంటికోట మేదర వీధిలో రహదారి లేక ఇబ్బంది పడుతున్నాం - స్థానికులు
● త్వరలోనే సీసీ రోడ్డు వేసి సమస్యను పరిష్కరిస్తాం - సద్గుణ, పంచాయతీ కార్యదర్శి, రెంటికోట – న్యూస్‌టుడే, పలాస గ్రామీణం

మేమున్నాం.. మీకు తోడుగా
(10 AM TO 1 PM)
ఇచ్ఛాపురం: 9440437129
పలాస : 8008574279
కవిటి గ్రామీణం : 8309638875
పలాస గ్రామీణం: 7386408926
కంచిలి గ్రామీణం: 9704568738

పలాస
● పలాస ● ఇచ్ఛాపురం

కాణిపాకంలో సిక్కోలు కళాకారుల ప్రదర్శన



చిత్తూరు జిల్లా కాణిపాకంలోని వరసిద్ధి వినాయక స్వామి వారి ఆలయంలో జరుగుతున్న ఉత్సవాల్లో గురువారం పలాస మండలం రేగులపాడు బృందం తప్పెటగుళ్ల ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ఆలయ అధికారులు రేగులపాడు తప్పెటగుళ్ల బృందాన్ని అభినందించారు. – న్యూస్‌టుడే, పలాస గ్రామీణం,

ప్రజలకు అండగా కూటమి ప్రభుత్వం

కంచిలి గ్రామీణం, కవిటి గ్రామీణం, న్యూస్‌టుడే: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ దశల వారీగా అమలు చేస్తామని ఎమ్మెల్యే బెందాళం అశోక్ పేర్కొన్నారు. పంచాయతీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. దీపావళి నుంచి ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ చేస్తామని స్పష్టం చేశారు. కంచిలి మండలం జాడుపూడిలో శుక్రవారం జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి దాసరి రాజుతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు నాయకులకు పౌర సన్మానం చేశారు. దాసరి రాజు మాట్లాడుతూ సనాతన ధర్మ పరిరక్షణ కోసం ప్రాయశ్చిత్త దీక్ష చేస్తున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు ప్రజలు అండగా నిలవాలని కోరారు. కూటమి నాయకులు కురయ్య, రామారావు, చిన్నారావు, కేశవరావు,ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ● ఒప్పంద అధ్యాపకుల సమస్యలను పరిష్కరించి వారిని రెగ్యులర్ చేయాలని కోరుతూ నియోజకవర్గంలోని వివిధ ప్రభుత్వ కళాశాలలో పని చేస్తున్న ఒప్పంద అధ్యాపకులంతా కలిసి ఎమ్మెల్యే బెందాళం అశోక్‌ను రామయ్యపుట్టుగలోని ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు.



ఎమ్మెల్యే అశోక్, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి దాసరి రాజును సన్మానిస్తున్న జాడుపూడి గ్రామస్థులు

స్వర్ణాంధ్ర-2047తో రాష్ట్రానికి మహర్దశ

పలాస, న్యూస్‌టుడే: స్వర్ణాంధ్ర 2047 కోసం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్వర్ణాంధ్ర 2047పేరిట జరిగిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రజల ప్రభుత్వంగా పాలన సాగించేందుకు ముఖ్యమంత్రి శ్రమిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఉన్నతి ధ్రువపత్రాలను అందజేశారు. ప్రిన్సిపల్ జె.వెంకటలక్ష్మి, ఏపీటీపీసీ ఛైర్మన్, తెదేపా రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, కౌన్సిలర్ దువ్వాడ శ్రీకాంత్, తెదేపా పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు బి.నాగరాజు, ఎస్.నవీన్, తెదేపా పార్లమెంట్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి పి.విఠల్ తదితరులు పాల్గొన్నారు. ● మహిళలంతా స్వయంకృషితో ఆర్థికాభివృద్ధి సాధించటం గొప్ప విషయమని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. కాశీబుగ్గ టెలికాం కార్యాలయం వద్ద పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) ఆధ్వర్యంలో మెప్మా అర్బన్ జార్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. పురపాలక సంఘం అధ్యక్షుడు బళ్ల గిరిబాబు, కమిషనర్ ఎన్.రామారావు, మెప్మా సీఎంఎం మోహన్, సీఎల్‌ఆర్‌పీలు, ఆర్‌పీలు తెదేపా నాయకులు మహిళలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

రహదారులు ధ్వంసం.. రాకపోకలకు కష్టం

గ్రామాభివృద్ధికి రహదారులే చిహ్నాలు. పాలకులు, అధికారులు వీటిపై పూర్తిగా నిర్లక్ష్యం చేయడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇచ్ఛాపురం నియోజకవర్గంలో ప్రధాన మార్గాలు దారుణంగా ఉన్నాయి. వైకాపా ప్రభుత్వ హయాంలో కనీస మరమ్మతులు చేపట్టకపోవడంతో ఎక్కడికక్కడ గుంతలు పడి ప్రమాదకరంగా మారాయి. భారీ వర్షాలకు పలు మండలాల్లో రోడ్లు కొట్టుకుపోయాయి. గిరిజన, తీరప్రాంతాల దారుల పరిస్థితి మరీ ఇబ్బందికరంగా తయారైంది. కూటమి ప్రభుత్వమైనా తమ సమస్యలను గుర్తించి గ్రామీణ ప్రాంత రహదారులను అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు.
– న్యూస్‌టుడే, సోంపేట, కవిటి గ్రామీణం, ఇచ్ఛాపురం గ్రామీణం



ఇచ్ఛాపురం: దెబ్బతిన్న ఇన్నీసుపేట రహదారి

మూడు మండలాలకు ఇబ్బందే..

సోంపేట మండలం రాణిగాం- ఎర్రముక్కాం, జాతీయరహదారి-బాతుపురం, కొత్తబాతుపురం-ఎంజీపురం, టి.శాసనాం-ఎకువూరు, పొత్తంగి-సుంకిడి రహదారులు ధ్వంసం కావడంతో సోంపేటతోపాటు కంచిలి, మందస మండలాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కంచిలి మండలంలో అంపురం-ఘాటిముకుందపురం, జలంత్రకోట-సువాగడ, జాడుపూడి-సిలగాం రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. ఈ మార్గాల్లో మూడు మండలాల ప్రజలు రాకపోకలు సాగిస్తున్నప్పటికీ అధికారులు, పాలకులు వీరి సమస్యలపై దృష్టి సారించడంలేదు.



కవిటి: ఎర్రగోవిందపుట్టుగ రోడ్డు ఇలా..



సోంపేట: అధ్వానంగా టి.శాసనాం-ఎకువూరు మార్గం

గుంతలైనా పూడ్చండి..

కవిటి మండలంలో జగతి-సిలగాం-జాతీయరహదారి, కవిటి-ఇద్దివానిపాలెం-బొరివంక, బైరిపురం-రాజపురం, కొజ్జిరియా-రాజపురం, జాతీయరహదారి-గొర్లెపాడు తదితర రహదారులపై రాకపోకలు కష్టంగా మారాయి. ఈ మార్గాల్లో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. కన్నుపుట్టుగ, ఎర్రగోవిందపుట్టుగ గ్రామాల్లో కనీసం గుంతలైనా పూడ్చాలని స్థానికులు వేడుకుంటున్నారు.

పక్కన పెట్టేశారు..

ఇచ్ఛాపురం మండలంలో ఈదుపురం-డొంకూరు, కొఠారి-ధర్మపురం-జాతీయరహదారి, కొళిగాం-తేలుకుంచి, పురుషోత్తపురం-ముచ్చింద్ర, జగన్నాథపురం- అరకభద్ర రోడ్లు దెబ్బతినడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. నియోజకవర్గంలో ఏఐఐబీ (ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్) సహాయంతో 65 రహదారులు, పైవంతెనల నిర్మాణానికి అప్పటి తెదేపా సర్కారు చర్యలు తీసుకున్నా.. గత వైకాపా ప్రభుత్వం ఆ పనులను పక్కన పెట్టడంతో ఈ దారుణ పరిస్థితి ఏర్పడింది.

త్వరలో పనులు చేపడతాం..

గత ప్రభుత్వం రహదారుల అభివృద్ధి గురించి పట్టించుకోకపోవడంతో గ్రామీణ రోడ్ల పరిస్థితి దారుణంగా తయారైంది. ఈ విషయమై ఇప్పటికే అధికారులతో సమీక్ష నిర్వహించాం. ఏఐఐబీ సాయంతో చేపడుతున్న రహదారుల విషయంలో ప్రభుత్వం నుంచి అనుమతుల కోసం వివరాలు పంపించాం. త్వరలో పనులు జరిగేలా చర్యలు చేపడతాం. – బెందాళం అశోక్, ఎమ్మెల్యే, ఇచ్ఛాపురం

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



ఇచ్ఛాపురం: విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఇచ్ఛాపురం, కవిటి గ్రామీణం, న్యూస్‌టుడే : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో జరిగిన పోటీల్లో ఇచ్ఛాపురం ఉన్నత పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయులు ఎన్.విశ్వనాథం తెలిపారు. మొత్తం వివిధ క్రీడాంశాల్లోని పలు విభాగాల్లో కె.మాధవ్, ఎస్.బెహర, ఎ.రేవంత్, సీహెచ్.గిరి, ఎన్.భగవాన్, టి.జీవన్ విజేతలుగా నిలిచారని హెచ్‌ఎం వివరించారు. ● కవిటి మండలం ఎస్.వి.జె విద్యా సంస్థలకు చెందిన 9వ తరగతి విద్యార్థి తిరుపతి అథ్లెటిక్ జిల్లా స్థాయిలో అండర్-19 విభాగంలో 5 కి.మీ వాక్ రేస్‌లో రెండో స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు కరస్పాండెంట్ బి.వి.వి.ప్రసాదరావు తెలిపారు.

తాగునీరు వృథా

వజ్రపుకొత్తూరు మండలంలోని ఉద్దానం ప్రాంతాల్లో నిర్మించిన తాగునీటి పథకాల ద్వారా అందించే తాగునీరు వృథా అవుతుంది. అధికారులు, పాలకులు దృష్టి సారించకపోవడంతో ఈ పరిస్థితి చోటుచేసుకుంటోందని పలువురు ఆరోపిస్తున్నారు. పాతటెక్కలిలో నిర్మించిన 40వేల లీటర్ల తాగునీటి పథకం ట్యాంకు నిండి వృథా అవుతున్న పట్టించుకున్న వారే లేరని, నిత్యం ఇదే పరిస్థితి నెలకొంటోందని స్థానికులు వాపోతున్నారు. పంచాయతీ కార్యదర్శి మధు మాట్లాడుతూ.. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తామన్నారు.
– న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు గ్రామీణం



ట్రాఫిక్ కష్టాలు కనరా!



ఇచ్ఛాపురంలో నిత్య సమస్యగా మారిన వీకేపేట తీరు ఇది. అసలే ఇరుకు.. ఆపై ఆక్రమణలతో ముందుకొచ్చిన వాణిజ్యసముదాయాలు, నివాసాలు.. ఉదయం నుంచి సాయంత్రం వరకూ భారీ వాహనాల రాకపోకలతో స్థానికులు, వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వీకేపేట, కేవీపేట కూడలిలో నిత్యం ఇదే సమస్య ఉత్పన్నమవుతోందని స్థానికులు వాపోతున్నారు. ఈ సమస్యపై పట్టణ ఎస్సై ఇ.చిన్నంనాయుడు స్పందిస్తూ.. ఆకస్మిక తనిఖీల ద్వారా భారీ వాహన చోదకులపై కేసులు నమోదు చేస్తామని తెలిపారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

సగంలో ఆగిన నిర్మాణం

మందస మండలం కొండలోగాం సచివాలయం పరిధిలో నిర్మించాల్సిన బల్క్‌మిల్క్ కేంద్రం భవనం ఇది. గత ప్రభుత్వ హయాంలో పనులు మొదలు పెట్టారు. నిధులు విడుదల కాకపోవడంతో సగంలోనే నిర్మాణ పనులను ఆపేశారు. ఏడాది కావొస్తున్న పనుల్లో పురోగతి లేకపోవడంతో పంచాయతీ ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. బిల్లులు రాక పనులు ఆగాయని, బిల్లులు వచ్చాక నిర్మాణం పూర్తి చేస్తామని సర్పంచి రోజ తెలిపారు. – న్యూస్‌టుడే, మందస



వీధి దీపాలు వెలిగించరూ..



పలాస మండలం బొడ్డపాడు పంచాయతీ మామిడిపల్లిలో రాత్రి వేళ అంధకారం నెలకుంటోంది. గ్రామం మొత్తం మీద సుమారు 40 వీధి దీపాలు ఉండగా అందులో కేవలం కొన్ని మాత్రమే వెలుగుతున్నట్లు గ్రామస్థులు చెబుతున్నారు. పంచాయతీ కార్యదర్శి మీనాకుమారి దృష్టికి ఎన్నిసార్లు తీసుకెళ్లినా కనీసం పట్టించుకోవడంలేదని ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై డీఎల్‌పీవో ఐవీ రమణ మాట్లాడుతూ.. రెండు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు.
– న్యూస్‌టుడే, పలాస గ్రామీణం

కాలువ పొంగింది... దుకాణాలను ముంచెత్తింది



కాశీబుగ్గ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల కూడలి వద్ద మురుగునీరు..

పలాస-కాశీబుగ్గ జంటపట్టణాల్లో శుక్రవారం కుండపోత వాన కురిసింది. కాశీబుగ్గ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల కూడలి వద్ద కాలువలో చెత్త పేరుకుపోవటంతో మురుగునీరు, వరద రహదారిపైకి చేరడంతో పాదచారులకు, వాహనచోదకులు ఇక్కట్లు పడ్డారు. కాలువ పొంగటంతోపాటు వరదనీరంతా సంతలో ఉన్న దుకాణాలను ముంచెత్తడంతో వ్యాపారులంతా తీవ్ర అవస్థలు ఎదుర్కొన్నారు. విద్యార్థులంతా మురుగునీటిలో నుంచే వెళ్లాల్సి వచ్చింది. పురపాలక సంఘం శానిటేషన్ సూపర్‌వైజర్లు, కార్మికులు చేరుకుని కాలువలో అడ్డంగా నిలిచిన చెత్తను తొలగించటంతో నీరంతా మూడురోడ్ల కూడలి వద్ద చేరింది. కాలువల్లో ఉన్న పూడికలు తొలగించి అందులో చెత్త వేయకుండా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, పలాస



సంతలో వరదనీటిలో మునిగిన దుకాణాలు

రైలులో గుర్తు తెలియని వ్యక్తి మృతి

కాశీబుగ్గ: రైలులో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు పలాస జీఆర్పీ ఎస్‌ఐ షరీఫ్ పేర్కొన్నారు. గౌహతి నుంచి భువనేశ్వర్ వెళ్తున్న రైల్లోని సాధారణ బోగీలో శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందగా పలాస రైలు నిలయంలో దించామన్నారు. మృతుడికి సుమారు 60 ఏళ్లు ఉంటుందన్నారు. మృతదేహాన్ని పలాస ప్రభుత్వాసుపత్రికి తరలించామని ఎస్‌ఐ పేర్కొన్నారు.

సర్వేపై అవగాహన

హరిపురం (మందస): మందస మండలం హరిపురంలో స్వర్ణాంధ్ర సర్వేపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వర్ణాంధ్ర 2047 కోసం మీ ఆలోచనలు స్వీకరిస్తున్నాం అనే సర్వేలో గ్రామ సంఘం డ్వాక్రా మహిళలకు అధికారులు తీర్మానం ఆమోదం గురించి చదివి వినిపించారు. డీపీఎంలు మందస, ఇచ్ఛాపురం ఏపీఎంలు పాల్గొన్నారు.

బాధితులకు భరోసా..



సమస్యలు విన్నవించేందుకు వస్తున్న బాధితులకు భరోసా కల్పిస్తామని ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి అన్నారు. శుక్రవారం కాశీబుగ్గలో నిర్వహించిన మీ కోసం (ప్రజా సమస్యల పరిష్కార వేదిక) కార్యక్రమంలో ప్రజలు నుంచి అర్జీలు స్వీకరించారు. ఎస్పీ మాట్లాడుతూ అందుతున్న అర్జీలపై చట్టపరిధిలో విచారణ చేపట్టి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. సివిల్, కుటుంబ కలహాలు తదితర అంశాలపై మొత్తంగా 12 ఫిర్యాదులు అందినట్లు పోలీస్ వర్గాలు పేర్కొన్నాయి. – న్యూస్‌టుడే, కాశీబుగ్గ

వన్య ప్రాణులను సంరక్షించండి

ఇచ్ఛాపురం గ్రామీణం, న్యూస్‌టుడే : వన్య ప్రాణులను సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యతని జిల్లా అటవీశాఖాధికారి యాళ్ల సంజయ్ పేర్కొన్నారు. మండలంలోని తేలుకుంచిలో ఉన్న విదేశీ విహంగాల విడిది కేంద్రాన్ని ఆయన శుక్రవారం సందర్శించారు. గ్రామస్థులతో మాట్లాడి అక్కడ సమస్యలు గురించి అడిగి తెలుసుకున్నారు. ఇక్కడ కల్పించాల్సిన మౌలిక సదుపాయలపై వెంటనే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాలని ఆదేశించారు. అసిస్టెంట్ కన్జర్వేటర్ నాగేంద్రరావు, పలాస రేంజ్ అధికారి మురళీకృష్ణం నాయుడు, మందస డీఆర్‌వో ఐ.రాము, బీట్ అధికారులు భానుమూర్తి, జోగారావు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



విదేశీ విహంగాల విడిది కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా అటవీశాఖాధికారి సంజయ్

ఏపీటీపీసీ ఛైర్మన్‌కు సత్కారం

ఆంధ్రప్రదేశ్ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ లిమిటెడ్ ఛైర్మన్‌గా వజ్జ బాబూరావును రాష్ట్ర ప్రభుత్వం నియమించటంతో పలాస-కాశీబుగ్గ లయన్స్‌క్లబ్ ఆయన్ను సత్కరించింది. పలాసలో ఆయన నివాసం వద్ద శుక్రవారం సాయంత్రం లయన్స్‌క్లబ్ ప్రతినిధుల బృందం, భాజపా నాయకులు బాబురావును కలిసి అభినందించారు. క్లబ్ అధ్యక్షుడు వై.ఎండుదొర, కార్యవర్గ సభ్యులు డోకి రామారావు, పైల తిరుమలరావు, కుమార్‌నాయక్, వి.వెంకటరావు, టి.కృష్ణమూర్తి, టి.మాధవరావు, వెంకటరావు, కాళీప్రసాద్, రాజశేఖర్ పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, పలాస



పర్యాటక అభివృద్ధితో ఉపాధి అవకాశాలు



విజేతలతో ప్రిన్సిపల్, అధ్యాపకులు

సోంపేట, న్యూస్‌టుడే: అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగపర్చుకొని పర్యాటకరంగం అభివృద్ధికి చర్యలు తీసుకోవడం ద్వారా ఉపాధి అవకాశాలు మెరుగుపర్చుకోవచ్చని బారువ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.రామారావు అన్నారు. శుక్రవారం ప్రపంచపర్యాటక దినోత్సవం సందర్భంగా కళాశాలలో వివిధ కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థులకు పర్యాటక రంగంపై అవగాహన కల్పించారు. క్విజ్, రంగోళి ఇతర పోటీలు నిర్వహించి బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. అధ్యాపకులు పాల్గొన్నారు.

భూ హక్కులు కల్పించి న్యాయం చేయండి

సోంపేట, న్యూస్‌టుడే: కొర్లాం అగ్రహారం చెరువు ఆయకట్టు భూముల రైతులకు హక్కులు కల్పించి న్యాయం చేయాలని ఆర్డీవోని కోరారు. శుక్రవారం పలాస ఆర్డీవో డాక్టర్ ఎస్.భరత్ కుమార్‌ను రైతు ప్రతినిధులు కలిసి సమస్యను వివరిస్తూ వినతిపత్రం అందజేశారు. ఒడిశా పాత్రపురం పోస్టు జయంతిపురం గ్రామానికి చెందిన కృష్ణచంద్రపాడి అనే వ్యక్తి ఆ భూములు అక్రమంగా వెబ్‌ల్యాండ్‌లో మార్పించుకొని తమకు ఇబ్బందులు సృష్టిస్తున్నారని తెలిపారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని ఆర్డీవో హామీ ఇచ్చినట్టు రైతుప్రతినిధులు తెలిపారు.



ఆర్డీవోకు వినతిపత్రం ఇస్తున్న కొర్లాం రైతు ప్రతినిధులు

అవీ.. ఇవీ.. అన్నీ

మత్స్యకారుని గల్లంతుపై పోలీసుల చర్యలు శూన్యం

సోంపేట: వేటకు వెళ్లి పడవ తిరగబడటంతో సముద్రంలో గల్లంతైన మత్స్యకారుడు రట్టి అప్పన్న విషయంలో పోలీసులు సరైన రీతిలో స్పందించకపోవడం దారుణమని ఎమ్మెల్యే బెందాళం అశోక్ అసంతృప్తి వ్యక్తం చేశారు. మత్స్యకార ఐక్యవేదిక ప్రతినిధులు సూరాడ చంద్రమోహన్, మద్దు కుమార్ తదితరులు గల్లంతు అంశాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా ఆయన ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డితో మాట్లాడారు. మూడు రోజులు కావస్తున్నప్పటికీ మెరైన్ పోలీసులు గల్లంతైన వ్యక్తి విషయంలో ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం దురదృష్టకరమని ఫిర్యాదు చేశారు. శుక్రవారం మెరైన్ పోలీసులు స్థానికులతో మాట్లాడి సముద్రంలో పరిస్థితి అల్లకల్లోలంగా ఉండటంతో ఆ వ్యక్తిని తీరానికి తీసుకురావడానికి సమయం పడుతుందని వివరించారు.

బాహుదాపై కొత్త వంతెన నిర్మించాలి

ఇచ్ఛాపురం: బాహుదానదిపై ఉన్న చరిత్రాత్మక వంతెనలో కొంత భాగం కుంగిపోగా, తాత్కాలికంగా చేపట్టిన చర్యలు పటిష్ఠంగాలేవని, ఈ పరిస్థితిలో కొత్త వంతెన నిర్మాణం చాలా అవసరమని సీడాప్ మాజీ అధ్యక్షుడు ఎస్.శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు విజయవాడలో రహదారులు-భవనాల శాఖ ఇంజినీర్ ఇన్ ఛీఫ్ నయిముల్లాకు వినతి పత్రం అందించారు.

నాడు-నేడు పనులపై విచారణ చేపట్టాలని వినతి

వజ్రపుకొత్తూరు: అక్కుపల్లి ఉన్నత పాఠశాలలో నాడు-నేడు ఫేజ్-2 కింద సుమారు రూ.46 లక్షలతో చేపట్టిన పనుల్లో అవకతవకలు జరిగాయని, వెంటనే సమగ్ర విచారణ చేయాలని ఆ పాఠశాల ఛైర్మన్ కొయిరి ఇందిరాప్రియదర్శిని, ఉప ఛైర్మన్ కుంది నీలవేణి, గ్రామాభివృద్ధి సంఘం అధ్యక్షుడు మోస వరప్రసాదు మండల తెదేపా అధ్యక్షుడు సూరాడ మోహనరావు కోరారు. ఈ విషయంపై స్థానిక ఎమ్మెల్యే గౌతు శిరీష, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసి విచారణ జరిపించాలని కోరారు.

విద్యార్థులు సన్మార్గంలో నడవండి

వజ్రపుకొత్తూరు గ్రామీణం: మంచి నడవడికే మనిషిని సన్మార్గంలో నడిపిస్తుందని గోవిందపురం పీహెచ్‌సీ మాజీ ఛైర్మన్ పుచ్చ ఈశ్వరరావు పేర్కొన్నారు. వజ్రపుకొత్తూరు మండలం గోవిందపురం ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాలలో గ్లోసంస్థ, నాట్స్ హోప్‌ఫర్ లైఫ్ సౌజన్యంతో బ్రైటర్‌డేపై అవగాహన సదస్సు నిర్వహించారు.

పలాస ఆర్డీవో బదిలీ

కాశీబుగ్గ: పలాస ఆర్డీవో ఎస్.భరత్‌నాయక్‌కు కర్నూలు జిల్లా పత్తికొండకు బదిలీ అయ్యారు. ఈయన గతేడాది అక్టోబర్‌లో ఇక్కడికి ఆర్డీవోగా వచ్చారు. కాగా పర్యటక శాఖ రాజమహేంద్రవరం ప్రాంతీయ సంచాలకుడిగా పనిచేస్తున్న వి.స్వామినాయుడిని పలాస ఆర్డీవో నియమించారు.

ప్రాయశ్చిత హోమం

పలాస, న్యూస్‌టుడే: తిరుమల లడ్డూ వివాదం నేపథ్యంలో శుక్రవారం పలాసలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో జనసేన ఆధ్వర్యంలో ప్రాయశ్చిత హోమం నిర్వహించారు. పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త వి.దుర్గారావు జనసేన నాయకులు వంశీకృష్ణచౌదరి, దర్మారావు, ఎ.తులసీరావు, నీలాచలం జనసైనికులు పాల్గొన్నారు.



నిబద్ధతతోనే గుర్తింపు

ఇచ్ఛాపురం: అన్ని వృత్తుల్లోకి ఉపాధ్యాయవృత్తికి ఎనలేనిగౌరవం ఉందని, దాన్ని నిలుపుతూ, వృత్తిపట్ల నిబద్ధతతో వ్యవహరిస్తే, మంచి గుర్తింపు లభిస్తుందని వక్తలు పేర్కొన్నారు. ఇచ్ఛాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో జరిగిన ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (అపస్) సమావేశంలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా పురస్కారం అందుకున్న బి.శంకరం మాస్టారును సంఘ ప్రతినిధులు సన్మానించారు.

అప్రమత్తంగా ఉండండి

కాశీబుగ్గ: రైలు ప్రయాణంలో అప్రమత్తంగా ఉండాలని జీఆర్పీ సీఐ రవికుమార్ అన్నారు. పలాస రైలు నిలయంలో శుక్రవారం ప్రయాణికులకు అవగాహన కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. ఎస్‌ఐ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో సమస్యల ఏకరువు

ఇచ్ఛాపురం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ బోర పుష్ప అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. రైతులకు సకాలంలో ఎరువుల అందక ఇబ్బంది పడుతున్నారని, వాటిని అందుబాటులోకి తీసుకురావాలని సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు మండల వ్యవసాయ అధికారిని కోరారు. ఈ విషయమై స్పందించిన వ్యవసాయాధికారిణి భార్గవి ఎరువులు పూర్తి స్థాయిలోనే వచ్చాయని, అయితే మరికొంత కొరత ఉందని, త్వరలోనే పూర్తి స్థాయిలో వాటిని రైతులకు అందిస్తామన్నారు. సమావేశంలో పలు సమస్యలపై సభ్యులు ఏకరువు పెట్టారు. జడ్పీటీసీ సభ్యురాలు ఉప్పాడ నారాయణమ్మ, ఏవో కె.రామారావు, అధికారులు పాల్గొన్నారు.

ఉద్యోగుల బాధ్యతల స్వీకరణ

పలాస, న్యూస్‌టుడే: పలాస విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలో పలాస, కాశీబుగ్గ, పలాస మండలంలో బదిలీలు జరగటంతో ఉద్యోగులు తమ బాధ్యతల్ని స్వీకరించారు.

? నందిగాం మండలం పెంటూరు, వజ్రపుకొత్తూరు మండలం పొల్లాడ రహదారి బడబంద కూడలి నుంచి కోటిపల్లి, బంజీరుపేట, రౌతుపురం రైల్వేహాల్ట్ వరకు సుమారు 4 కి.మీ. మేర గోతులమయంగా మారింది. – దేవరాజు, బడబంద

● బీటీ రహదారి నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరైన వెంటనే పనులు చేపడతాం. - మోహన్, ఏఈ, పీఐయూ.

– న్యూస్‌టుడే, నందిగాం

టెక్కలి

●టెక్కలి ●నరసన్నపేట ●పాతపట్నం

పనులు వేగవంతం చేయాలి



వంశధార జలాశయం పనులు వేగవంతం చేయాలని ఉత్తరాంధ్ర ప్రాజెక్టుల సీఈ సుగుణాకరరావు అన్నారు. శుక్రవారం హిరమండలంలోని జలాశయాన్ని ఆయన పరిశీలించారు. పనులు 95శాతం పూర్తయ్యాయని, మిగిలినవి త్వరితగతిన చేపట్టాలని అధికారులకు సూచించారు. ఎత్తిపోతల పథకం పూర్తయితే జలాశయంలో 19 టీఎంసీల నీరు నింపేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు. డీఎస్ఈ స్వర్ణకుమార్, ఈఈ ఎంవీ రమణ, సోమా కంపెనీ మేనేజర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

– న్యూస్‌టుడే, హిరమండలం

ఓటర్ల జాబితా సవరణకు సహకరించండి



రాజకీయ పార్టీల నాయకులతో మాట్లాడుతున్న ఆర్వో రామ్మోహనరావు

నరసన్నపేట, హిరమండలం, న్యూస్‌టుడే: ఓటర్ల జాబితాల సవరణ, పోలింగ్ కేంద్రాల మార్పులకు సహకరించాలని రిటర్నింగ్ అధికారి రామ్మోహనరావు సూచించారు. నరసన్నపేట తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన మాట్లాడారు. తెదేపా నాయకుడు చంద్రశేఖర్, చిట్టిబాబు, వెంకటఅప్పలనాయుడు, తహసీల్దార్లు లక్ష్మీనారాయణ, సురేష్ పాల్గొన్నారు. తమకు సమాచారం ఇవ్వకుండా సమావేశం నిర్వహించడం తగదని కాంగ్రెస్ నాయకుడు నర్సింహమూర్తి పేర్కొన్నారు. ● హిరమండలం సుభలయ ఆర్ఆర్ కాలనీలో పోలింగ్ కేంద్రం పెంపునకు ప్రతిపాదనలు పంపుతున్నట్లు డీటీ వెంకటరమణ తెలిపారు. శుక్రవారం రాజకీయ పార్టీలకు చెందిన ప్రతినిధులతో తహసీల్దారు కార్యాలయంలో ఆయన సమావేశం నిర్వహించారు. జడ్పీటీసీ సభ్యుడు పి.బుచ్చిబాబు పాల్గొన్నారు.

పారా లీగల్ వాలంటీర్లుగా చేరండి

నరసన్నపేట, పాతపట్నం, న్యూస్‌టుడే: నరసన్నపేట జూనియర్ సివిల్ జడ్జి కోర్టు పరిధిలో పారా లీగల్ వాలంటీర్లుగా సేవలందించేందుకు దరఖాస్తు చేసుకోవాలని జడ్జి హరిప్రియ సూచించారు. పదో తరగతి ఉత్తీర్ణులైన వారు అర్హులని తెలిపారు. వివరాలకు 80085 15927 నంబరును సంప్రదించాలన్నారు. ● పారా లీగల్ వాలంటీర్ల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జడ్జి రోషిణి పేర్కొన్నారు. పాతపట్నం, సారవకోట, హిరమండలం పరిధిలో పనిచేయుటకు ఆసక్తి కలిగిన వారు పాతపట్నం మండల న్యాయ సేవా సమితిని సంప్రదించాలని కోరారు.

ఎంఎంఎస్ అధ్యక్షురాలిగా కల్పన

నరసన్నపేట, న్యూస్‌టుడే: మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలిగా పుచ్చల కల్పన ఎన్నికయ్యారు. స్థానిక ఎంఎంఎస్ కార్యాలయంలో శుక్రవారం కార్యవర్గాన్ని గ్రామ సమాఖ్య ప్రతినిధులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షురాలిగా మెండ లక్ష్మి, కోశాధికారిగా సుజాత, కార్యదర్శిగా అరుణకుమారి ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని ఎమ్మెల్యే రమణమూర్తి అభినందించారు. సంఘాల బలోపేతానికి కృషి చేయాలని ఆయన సూచించారు.

కబ్జాల పర్వం.. కనుమరుగైన కాసారం..!



ఆక్రమణలకు గురైన నరేంద్రపురం నల్లచెరువు

న్యూస్‌టుడే, నందిగాం

చిన్నా, పెద్దా సుమారు 432 చెరువులు నందిగాం మండలంలో ఉన్నాయి. ఆయా చెరువులు కబ్జాదారుల కోరల్లో చిక్కుకు పోవడంతో ఏటా కుచించుకు పోతున్నాయి. కూర్చున్న చెట్టు కొమ్మనే నరుక్కుంటున్న చందంగా కొంత మంది రైతులు కాసారాల గర్భాలను చదును చేసి పొలాలుగా మారుస్తున్నారు. దీంతో కరవును కోరి తెచ్చుకుంటున్న పరిస్థితి. సమస్యపై రెవెన్యూ యంత్రాంగానికి మొర పెట్టుకుంటున్నా నిమ్మకి నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని పలువురు వాపోతున్నారు. దీంతో సాగునీటికి అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇదీ పరిస్థితి..

★ కొండల ప్రాంతానికి ప్రధాన సాగునీటి వనరైన కల్లాడ సమీపంలోని పద్మనాభసాగరం సాగరంపేట పరిధిలో సర్వే నంబరు 1లో 62.01 ఎకరాలు, మల్లివీడులో సర్వే నంబరు 263లో 11.57 ఎకరాలు, 265లో 56.65 ఎకరాలు, కల్లాడ పరిధిలో సర్వే నంబరు 225-1 లో 2.06 ఎకరాలు మొత్తం 132.29 ఎకరాల విస్తీర్ణంలో ఉండేది. దీని ద్వారా సుమారు 800 ఎకరాలకు సాగునీరు అందేది. తటాకంలో దాదాపు 30 ఎకరాలు ఆక్రమణకు గురవడంతో 450 ఎకరాలకు సైతం సాగునీరు అందడంలేదని రైతులు వాపోతున్నారు.

★ నరేంద్రపురానికి చెందిన నల్ల చెరువు సర్వే నంబరు 61-2లో 27.99 ఎకరాల విస్తీర్ణంలో ఉండేది. సుమారు 150 ఎకరాలకు సాగునీరు అందేది. ఇందులో సుమారు 10 ఎకరాల వరకు కబ్జా చేయడంతో 100 ఎకరాలకు సైతం నీరు అందడం లేదని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ★ పెద్దతామారాపల్లి ఒడ్డి చెరువు, కొత్తపేట చెరువు, చిన్నతామారాపల్లిలోని పెద్ద చెరువులు ఒక్కోటి 4-5 ఎకరాల మేర ఆక్రమణలకు గురయ్యాయి.

అధికారులు స్పందించాలి



పద్మనాభసాగరంలో ఆక్రమణలు పెరిగిపోవడంతో నీటి నిల్వ సామర్థ్యం తగ్గుతోంది. వర్షాకాలంలో చప్టా మీదుగా నీరు ప్రవహించి సండెమ్మ గెడ్డ ద్వారా వృథాగా సముద్రంలో కలుస్తోంది. పంట పొట్ట దశకు చేరే సమయానికి సాగునీరు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ఇప్పటికైనా అధికారులు స్పందించాలి.

– డోల రాజారావు, రైతు, కైజోల

ఆక్రమణలు తొలగిస్తాం

పద్మనాభసాగరంలో ఆక్రమణలపై ఇది వరకే రైతులు విన్నవించారు. దీంతో కొంత వరకు తొలగించాం. ఆర్ఐ, సర్వేయర్లను పంపించి పూర్తిస్థాయిలో చెరువుల్లో ఆక్రమణలు తొలగించి, రైతుల ఇబ్బందులు తీరుస్తాం.

– భాగ్యలక్ష్మి, తహసీల్దారు, నందిగాం

రైతులను శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దడమే లక్ష్యం

హిరమండలం, న్యూస్‌టుడే: రైతులను శాస్త్రవేత్తలుగా తీర్చి దిద్దడమే లక్ష్యంగా 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఏవో బి. సంధ్య అన్నారు. శుక్రవారం కిట్టాలపాడు వ్యవసాయ క్షేత్రాల్లో అన్నదాతలకు పలు అంశాలపై సూచనలిచ్చారు. వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

సామర్థ్యాలు మెరుగుపరచాలి

నరసన్నపేట గ్రామీణం, న్యూస్‌టుడే: విద్యార్థుల సామర్థ్యాలను మెరుగు పరచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈవోలు దాలినాయుడు, శాంతారావు సూచించారు. బసివలస ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం వారు ఉపాధ్యాయులతో మాట్లాడారు. వెనుకబడిన విద్యార్థులకు తోడ్పాటు అందించాలన్నారు. బృంద సభ్యులు కల్పన, గిరి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కేళీల ఏరివేతతో అధిక దిగుబడులు

జలుమూరు, న్యూస్‌టుడే: వరిలో కేళీల ఏరివేతతో అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయాధికారి కె. సురేష్ తెలిపారు. జోనంకి పంచాయతీ గంగాధరపేట సమీపంలో పంట పొలాల్లో కేళీలు తొలిగిస్తున్న రైతులకు శుక్రవారం ఆయన పలు సూచనలు చేశారు. గింజ కట్టిన సమయంలో పరిమాణం, రంగు గుర్తించాలన్నారు.

మారని దారి.. తీరని అవస్థలు



సంతబొమ్మాళి మండలం ఉమిలాడ- వనవిష్ణుపురం కూడలి రహదారి గోతులమయంగా మారింది. సుమారు 2 కి.మీ. మార్గం అధ్వానంగా మారడంతో రాకపోకలకు నిత్యం ఇబ్బందులు పడుతున్నట్లు వాహనదారులు చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు. ఈ విషయమై కోటబొమ్మాళి ఆర్అండ్‌బీ జేఈ హరనాథ్ మాట్లాడుతూ.. తాత్కాలికంగా మరమ్మతులు చేపడతామని, నిధులు మంజూరైన వెంటనే పూర్తిస్థాయిలో పనులు చేయిస్తామన్నారు. – న్యూస్‌టుడే, సంతబొమ్మాళి

ఎండైనా.. వానైనా ఆరుబయటే

కొత్తూరు మండలంలోని మెట్టూరు ఉన్నత పాఠశాల విద్యార్థులు సైకిల్ షెడ్డు లేక తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. పలు గ్రామాల నుంచి సుమారు 500 మంది వరకు ఇక్కడకు చదువుకునేందుకు వస్తుంటారు. సైకిళ్లు పెట్టేందుకు చోటు లేకపోవడంతో రహదారి పక్కనే ఆరుబయట నిలుపుదల చేస్తున్నారు. దీంతో ఎండకు ఎండి, వానకు తడిసి మరమ్మతులకు గురవుతున్నాయని పిల్లలు వాపోతున్నారు. అధికారులు స్పందించాలని కోరుతున్నారు. దీనిపై ఎంఈవో గోవిందరావును వివరణ కోరగా చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, కొత్తూరు



అవస్థల మధ్య ఆటలు..!

నరసన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం బురదమయంగా మారింది. విశాలమైన ప్రాంగణం ఉన్నా సరైన సదుపాయాలు లేక క్రీడాకారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల రెండు రోజుల పాటు నియోజకవర్గ స్థాయి పోటీలు జరిగాయి. వందలాది మంది క్రీడాకారులు ఆడేందుకు అవస్థలు పడ్డారు. క్రీడాస్థలం అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయాన్ని కళాశాల ప్రిన్సిపల్ సత్యనారాయణ వద్ద ప్రస్తావించగా.. ప్రతిపాదనలు పంపించామని, నిధులు మంజూరైతే అభివృద్ధి చేస్తామన్నారు. – న్యూస్‌టుడే, నరసన్నపేట



నిర్మాణానికి నోచుకునేదెప్పుడు..?



గ్రామాల్లో వైద్య సేవలు అందించాలన్న సంకల్పంతో వైకాపా హయాంలో పనులు చేపట్టిన విలేజ్ హెల్త్ క్లీనిక్‌లు పలుచోట్ల మధ్యలో నిలిచిపోయాయి. పాతపట్నం పంచాయతీ కాపు వీధిలో రెండేళ్ల క్రితం ఆరోగ్య కేంద్రం భవనం నిర్మాణం ప్రారంభించారు. బిల్లుల చెల్లింపుల్లో జాప్యంతో పిల్లర్ల స్థాయిలోనే పనులు ఆగిపోయాయి. దీంతో ఎక్కడి వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా పరిస్థితి మారిందని స్థానికులు పెదవి విరుస్తున్నారు. నిధులు మంజూరైతే సమస్యను పరిష్కరిస్తామని మండల ఇంజినీరింగ్ అధికారి ప్రసాద్‌రావు చెప్పారు. – న్యూస్‌టుడే, పాతపట్నం

వనితమండలం రోడ్డుకు నిధుల మంజూరు

పోలాకి, న్యూస్‌టుడే: వనితమండలం రోడ్డు నిర్మాణానికి రూ.1.27 కోట్ల నిధులు మంజూరయ్యాయని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. శుక్రవారం వనితమండలం గ్రామంలో నిర్వహించిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రహదారి సమస్యను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన నిధులు మంజూరు చేయించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి ఆర్.మురళీధర్, ఏఎంసీ మాజీ అధ్యక్షుడు బైరి భాస్కరరావు పాల్గొన్నారు.



వనితమండంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

సంక్షిప్త సమాచారం



కొత్తమ్మతల్లి సేవలో గొండు శంకర్

కోటబొమ్మాళి, న్యూస్‌టుడే: కొత్తమ్మతల్లిని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ శుక్రవారం దర్శించుకుని ప్రత్యేకపూజలు చేశారు. ఈవో రాధాకృష్ణ, తెదేపా నాయకులు గోవిందరాజులు, రమేష్, గోవిందరావు ఆయనకు స్వాగతం పలికారు.

జిల్లా ఆసుపత్రికి కుర్చీల వితరణ

టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే: జిల్లా ఆసుపత్రికి తెదేపా మండల ప్రధానకార్యదర్శి మామిడి రాము 20 కుర్చీలను శుక్రవారం వితరణగా అందజేశారు. నాయకులు నారాయణరావు, బాలరాజు, వైద్యుడు లక్ష్మణరావు పాల్గొన్నారు.

తల్లీబిడ్డకు తప్పిన ప్రమాదం

టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే: టెక్కలి రైల్వే స్టేషన్ వద్ద శుక్రవారం పెద్ద ప్రమాదం తప్పింది. విశాఖ- గుణుపురం రైలులో చంటి బిడ్డను ఎత్తుకుని దిగిన ఓ మహిళ అదుపుతప్పి ప్లాట్‌ఫాంపై పడిపోవడంతో స్వల్ప గాయాలయ్యాయి. రైలు ముందుకు కదులుతున్న సమయంలో దిగే ప్రయత్నం చేయడంతో ప్రమాదం జరిగింది.

29న దళిత అవగాహన సదస్సు

టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే: స్థానిక ఆదిత్య కల్యాణ మండపంలో ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ అంశంపై ఈనెల 29న నిర్వహించనున్న అవగాహన సదస్సును జయప్రదం చేయాలని ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాటసమితి అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు నారాయణరావు, రామారావు శుక్రవారం కోరారు. కార్యక్రమానికి మాజీ ఎంపీ హర్షకుమార్ హాజరవుతారన్నారు.

అత్యాచారం కేసుపై వివరాల సేకరణ

సారవకోట, న్యూస్‌టుడే: పెద్దలంబ పంచాయతీని డీఎస్పీ బి.రాజశేఖర్ శుక్రవారం సందర్శించారు. ఈ పంచాయతీకి చెందిన బాలికపై మూగుపురం గ్రామానికి చెందిన హేమసుందరరావు అత్యాచారానికి పాల్పడటంతో సారవకోట ఎస్ఐ అనిల్‌కుమార్ కేసునమోదు చేశారు. ఈ మేరకు డీఎస్పీ బాధితురాలితో మాట్లాడారు.

బాధ్యతల స్వీకరణ

జలుమూరు, సారవకోట, న్యూస్‌టుడే: జలుమూరు ఎంపీడీవోగా కె.అప్పలనాయుడు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈవోపీఆర్డీ ఉమామహేశ్వరరావు, ఏవో దామోదరరావు ఎంపీడీవోను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ● సారవకోట ఎంపీడీవోగా పొన్నాడ మురళీమోహన్ విధుల్లో చేరారు. కార్యాలయ సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు. ఈవోపీఆర్డీ రేణుక, ఏవో చిన్నమ్ముడు పాల్గొన్నారు.

ఈకేవైసీ చేయించుకోవాలి

మెళియాపుట్టి, న్యూస్‌టుడే: రైతులు ఈనెల 30 నాటికి ఈకేవైసీ చేయించు కోవాలని ఏవో దానకర్ణుడు సూచించారు. రైతు సేవా కేంద్రాల్లో వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. ధాన్యం కొనుగోళ్లకు సంబంధించిన ఆర్థిక లావాదేవీలకు ఉపయోగపడుతుందన్నారు.



ఉత్సవాలకు అంకురార్పణ

సారవకోట, న్యూస్‌టుడే: సారవకోటలో దుర్గాదేవి ఉత్సవాలకు శుక్రవారం అంకురార్పణ జరిగింది. వర్తక సంఘం, మోటారు యూనియన్ ఆధ్వర్యంలో వేద పండితులు సంతోష్‌శర్మ పందిరిరాట వేశారు. నందాన ప్రకాశరావు, శ్రీదేవి దంపతులు, ఎస్.సత్యం, మాజీ సర్పంచి డోకి భానుమతి పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయుడికి సన్మానం

జలుమూరు, న్యూస్‌టుడే: జలుమూరు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మెండ రామారావును తల్లిదండ్రుల కమిటీ సభ్యులు, తోటి ఉపాధ్యాయులు సన్మానించారు. పాఠశాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తుండటంతో శుక్రవారం ఆయనను సత్కరించారు. ఎంఈవో మాధవరావు, బాలికోన్నత పాఠశాల హెచ్ఎం వేణుగోపాలరావు పాల్గొన్నారు

ఆయా నియామకంపై ఫిర్యాదు

ఎల్ఎన్‌పేట, న్యూస్‌టుడే: తురకపేట ప్రాథమిక పాఠశాలలో నిబంధనలకు విరుద్ధంగా ఆయా నియామకంపై ఆ పాఠశాల కమిటీ ఛైర్మన్ శ్రీను, వైస్ ఛైర్మన్ యమున స్థానిక ఎమ్మెల్యే గోవిందరావుకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఎంఈవో మణికుమార్ వద్ద ప్రస్తావించగా విచారణ చేయిస్తామన్నారు.

అందరికీ అభివృద్ధి ఫలాలు



పెద్దతామరాపల్లిలో కరపత్రాలు ప్రదర్శిస్తున్న కూటమి నాయకులు, గ్రామస్థులు

నందిగాం, న్యూస్‌టుడే: అభివృద్ధి ఫలాలు అందరికీ అందించడమే ప్రభుత్వ ధ్యేయమని కూటమి నేతలు పేర్కొన్నారు. మండలంలోని బడగాం, పెద్దతామరాపల్లిలో పంచాయతీ కార్యదర్శులు గోపీనాథ్, చంద్రశేఖరరావు ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. ఇంటింటా కరపత్రాలు పంపిణీ చేశారు. కూన మల్లేషు, సనపల జయంతిరావు, పోలాకి ఢిల్లేశ్వరరావు పాల్గొన్నారు.

వసతిగృహాల్లో న్యాయమూర్తి పరిశీలన



పోస్టుమెట్రిక్ వసతిగృహంలో సరుకులు పరిశీలిస్తున్న శ్రీనివాసరావు

టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే: టెక్కలిలోని పలు వసతిగృహాలను సీనియర్ సివిల్‌జడ్జి జె. శ్రీనివాసరావు శుక్రవారం పరిశీలించారు. స్థానిక సమీకృత, పోస్టుమెట్రిక్, ఎస్సీ బాలుర వసతిగృహాల్లో తనిఖీలు జరిపారు. వసతులు, అందిస్తున్న ఆహారం, వైద్యసేవల గురించి విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం సంక్షేమాధికారులకు పలు సూచనలు చేశారు.

లింగ వివక్ష తగదు



ప్రసంగిస్తున్న జూనియర్ సివిల్ జడ్జి బీఎంఆర్ ప్రసన్నలత

కోటబొమ్మాళి, న్యూస్‌టుడే: బాలికల పట్ల లింగ వివక్ష తగదని జూనియర్ సివిల్‌జడ్జి బీఎంఆర్ ప్రసన్నలత సూచించారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు కోటబొమ్మాళి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేయటం చట్టరీత్యా నేరమని న్యాయమూర్తి పునరుద్ఘాటించారు. న్యాయవాదుల సంఘ అధ్యక్షుడు శ్రీనివాసులు, ప్రిన్సిపల్ సంతోషి, అధ్యాపకులు పాల్గొన్నారు.

సంపద కేంద్రాలతో ఆదాయం సృష్టించండి

టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే: చెత్తనుంచి సంపద తయారీ కేంద్రాల ద్వారా ఆదాయం సృష్టించాలని డివిజనల్ పంచాయతీ అధికారి ఇప్పిలి వెంకటరమణ సూచించారు. కొత్తూరులోని సంపద తయారీ కేంద్రాన్ని ఆయన పరిశీలించి పంచాయతీ కార్యదర్శి చంద్రరావుకు సూచనలిచ్చారు. అనంతరం కేంద్రం ఆవరణలో మొక్కలు నాటారు.

నాడు మూతపడి.. నేడు మెరుగుబడి



నౌగుడలో పిల్లలకు పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయులు జయరామ్, సునీత

న్యూస్‌టుడే, హిరమండలం

హిరమండలం పంచాయతీ నౌగుడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను విద్యార్థులు తక్కువ ఉన్నారనే కారణంతో గతంలో మూసివేశారు. అనంతరం తల్లిదండ్రుల వినతుల మేరకు తెరిచారు. ప్రస్తుతం అక్కడ 30 మంది పిల్లలు చదువుతుండటం విశేషం. దీనికి కారణం అక్కడి పనిచేస్తున్న ఉపాధ్యాయులు ఎం.జయరామ్, జె.సునీత అని స్థానికులు చెబుతున్నారు. అంకిత భావంతో ఆకట్టుకునేలా బోధన కొనసాగిస్తుండటంతో పాఠశాలకు దూరంగా ఉన్న గ్రామాలకు చెందిన పిల్లలు ఇక్కడ చేరుతున్నారని పలువురు చెబుతున్నారు.

సమీప పాఠశాలలో విలీనం

2015-16 విద్యా సంవత్సరంలో ఈ బడిలో కేవలం 13 మంది విద్యార్థులుండటంతో అధికారులు మూసివేసి సమీపంలోని కోరాడ కాలనీ ప్రాథమికోన్నత పాఠశాలలో విలీనం చేశారు. ఆ తర్వాత కొన్నేళ్ల పాటు తెరుచుకోలేదు. అనంతరం గ్రామస్థులు సీతంపేట ఐటీడీఏ పీవో, జిల్లా విద్యాశాఖ అధికారిని కలిసి పాఠశాల తెరవాలని వినతి పత్రాలు అందజేశారు. డీఈవో ఆదేశాల మేరకు 2018 జూన్ 14న నౌగుడ పాఠశాలలో తిరిగి తరగతులు నిర్వహించారు. కోరాడ కాలనీ పాఠశాల నుంచి ఉపాధ్యాయిని జి.పద్మజను డిప్యూటేషన్‌పై ఇక్కడ బోధనకు కేటాయించారు. ఆమెతో పాటు ఉపాధ్యాయుడు బి.జగదీష్ విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి పిల్లలను చేరేలా కృషి చేశారు. ఆ తర్వాత విధులు చేపట్టిన ఉపాధ్యాయులు జయరామ్, సునీత కృషితో ఈ సంవత్సరం ఆ సంఖ్య 30కి చేరింది.

బోధన అభినందనీయం

మూతపడిన నౌగుడ పాఠశాలను గ్రామస్థుల కోరిక మేరకు తెరిచేందుకు అనుమతి ఇచ్చాం. ఉపాధ్యాయులు చిత్తశుద్ధితో పనిచేస్తుండటంతో సమీప గ్రామాల నుంచి విద్యార్థులు ఈ పాఠశాలలో ప్రవేశాలు పొందుతున్నారు. ఇందులో కొంతమంది ప్రభుత్వ ఉపాధ్యాయుల పిల్లలు సైతం ఉన్నారు.

- కె.రాంబాబు, ఎంఈవో, హిరమండలం

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న సీఐ ఎన్.సాయి

పాతపట్నం, న్యూస్‌టుడే: చట్టాలపై విద్యార్థులకు అవగాహన ఉండాలని పాతపట్నం సీఐ ఎన్.సాయి అన్నారు. శుక్రవారం పాతపట్నం మోడల్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. గంజాయి, మైనర్ డ్రైవింగ్, ట్రాఫిక్ నియమాలు, సైబర్ నేరాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ శ్రీరాములు పాల్గొన్నారు.

అనుమతులు తప్పనిసరి

హిరమండలం, న్యూస్‌టుడే: అనుమతులు లేకుండా బాలల వసతి గృహాలు నిర్వహిస్తే చర్యలు తప్పవని జిల్లా బాలల సంక్షేమ సమితి అధికారి కేవీ రమణ అన్నారు. శుక్రవారం బ్యారేజి సెంటరులో నిర్వహిస్తున్న బాలల వసతి గృహాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు మల్లేశ్వరరావు, ఎల్.ఎల్.నాయుడు, లక్ష్మణరావు, రమణమూర్తి, గన్నప్పుడు, సీడీపీవో విమలకుమారి, పర్యవేక్షకులు సుధావాణి పాల్గొన్నారు.

కంటి వ్యాధులపై నిర్లక్ష్యం వద్దు

కొత్తూరు, న్యూస్‌టుడే: కంటి వ్యాధులపై నిర్లక్ష్యం వద్దని నేత్ర వైద్య నిపుణులు ఇప్పిలి జానకిరామయ్య అన్నారు. మండలంలోని పారాపురం ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా సమస్యలు ఉన్నవారికి ఉచితంగా కళ్లద్దాలు అందించారు. హెచ్ఎం చంద్రకాంత్, విద్యా కమిటీ ఛైర్మన్ చిట్టి రవి పాల్గొన్నారు.

దోష పరిహారానికి పూజలు

కొత్తూరు, న్యూస్‌టుడే: స్థానిక వరప్రద వెంకటేశ్వర స్వామి ఆలయంలో భక్తులు శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. తిరుపతి తిరుమల దేవస్థానంలోని లడ్డూ ప్రసాదాన్ని అపవిత్రం చేశారని, దోష పరిహారానికి ప్రత్యేక పూజలు చేసినట్లు తితిదే ఆధ్యాత్మిక మండలి సభ్యుడు రవి, ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు.



శ్రీకాకుళం

•శ్రీకాకుళం •ఆమదాలవలస •ఎచ్చెర్ల

తెరపై ఈనాడు

● కీర్తన: సరిపోదా శనివారం ● కీర్తిక: దేవర ● కిన్నెర సినీమాక్స్: సత్యం సుందరం ● ఎస్‌వీసీ (రామలక్ష్మణ): దేవర ● సూర్యమహల్: దేవర ● సరస్వతి: దేవర ● చంద్రమహల్: మత్తు వదలరా-2 ● మారుతి: దేవర

– న్యూస్‌టుడే, అరసవల్లి

ఆరోగ్య పరిరక్షణకు కృషి చేయండి

శ్రీకాకుళం నగరం, న్యూస్‌టుడే: ఆరోగ్య పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సూచించారు. ఆర్ఎస్‌పీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వచ్చే నెల 1 నుంచి ఆరోగ్యంపై ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమానికి సంబంధించిన గోడప్రతులను ఆవిష్కరించారు. జడ్పీ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో ఆర్ఎస్‌పీ ఫౌండేషన్ పాత్ర అభినందనీయమన్నారు. ఫౌండేషన్ ప్రతినిధులు పి.రాజశేఖర్, మణిశర్మ తదితరులు పాల్గొన్నారు.

పర్యాటక రంగ అభివృద్ధితో స్థానికులకు ఉపాధి



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

శ్రీకాకుళం నగరం, న్యూస్‌టుడే: పర్యాటక రంగ అభివృద్ధితో స్థానికులకు ఉపాధి అవకాశాలు పెంపొందుతాయని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ కె.సూర్యచంద్రరావు అన్నారు. కళాశాలలో శుక్రవారం ప్రపంచ పర్యాటక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో పర్యాటక రంగం పాత్ర కీలకమన్నారు. విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. సెట్‌శ్రీ సీఈవో ప్రసాదరావు, ఇంటాక్ కోకన్వీనర్ ఎన్.మోహన్, పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

మాతాశిశు ఆరోగ్య రక్షణే లక్ష్యం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొండు శంకర్

గార, న్యూస్‌టుడే: మాతాశిశువుల సంపూర్ణ ఆరోగ్య రక్షణే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. కుటుంబానికి అమ్మ అవసరం ఎంతో అంగన్‌వాడీ సేవలూ అంతే అవసరమని వ్యాఖ్యానించారు. గార మండలం కొల్లివలస వద్ద ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో శుక్రవారం పీవో రాధామాధవి, ఏపీవో తులసిలక్ష్మి ఆధ్వర్యంలో పోషణ్ మహా కార్యక్రమం నిర్వహించారు. దీనికి హాజరైన ఎమ్మెల్యే కార్యాలయం ఆవరణలో న్యూట్రీ గార్డెన్‌ను ప్రారంభించారు. సామూహిక సీమంతాలు కార్యక్రమంలో పాల్గొని గర్భిణులకు ఆరోగ్య సంబంధ అంశాలపై పలు సూచనలు చేశారు. పౌష్టికాహారం స్టాళ్లు పరిశీలించారు. పీడీ శాంతిశ్రీ, శ్రీకాకుళం గ్రామీణం, గార మండలాల ఎంపీపీలు, ఎంపీటీసీ సభ్యులు, తహసీల్దారు ఎస్.రమణారావు, ఎంపీడీవో శిమ్మ రామ్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

వీడని బెడద.. వీధుల్లో దడ..!



❖ నగరంలో కుక్కల స్వైర విహారం

❖ నియంత్రించలేకపోతున్న యంత్రాంగం

శ్రీకాకుళం నగరంలో ఏ వీధి లోకి వెళ్లినా కుక్కల బెడదే. పగలూ రాత్రి తేడా లేకుండా గుంపులుగా స్వైర విహారం చేస్తూ బెంబేలెత్తిస్తున్నాయి. వాహనదారులు వెంట పడుతూ దాడులు చేస్తున్నాయి. వాటి నియంత్రణకు అధికారులు చర్యలు చేపట్టకపోవడం నగరవాసుల పాలిట శాపంగా మారింది. శునకాల సంతతి విపరీతంగా పెరిగిపోతుండటంతో సమస్య రోజురోజుకీ మరింత జటిలమవుతోంది.

– న్యూస్‌టుడే, శ్రీకాకుళం నగరం

నగరం వివరాలిలా...

డివిజన్లు: 50

జనాభా: 1.83 లక్షలు

కుటుంబాలు: 65 వేలు

శునకాల సమస్య విపరీతంగా ఉంటే సంప్రదించాల్సిన నంబరు:

99852 28226

నగరంలోని అన్ని డివిజన్లలో కుక్కల బెడద ఉంది. విశాఖ ఏ, బీ, బాంకర్స్, ఏపీహెచ్‌బీ, కంపోస్టు కాలనీలతో పాటు బలగ, జీటీ రోడ్డు, బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో గుంపులుగా సంచరిస్తున్నాయి. రాత్రి వేళ వీధుల్లోకి వచ్చే వారిపై దాడులకు పాల్పడుతుండటంతో బయటకు రావాలంటే ప్రజలు భయపడిపోతున్నారు. అవి వెంటపడుతుండటంతో వాహనం వేగం పెంచి అదుపు తప్పి పలువురు చోదకులు గాయాలపాలైన సందర్భాలూ ఉన్నాయి.

ఏం చేయాలంటే..

కుక్కలను చంపే అధికారం నగరపాలక సంస్థకు లేదు. కుక్కకాటుతో రేబిస్ వ్యాధి సంక్రమించి, నిర్లక్ష్యం చేస్తే మనిషి ప్రాణాలు సైతం పోయే ప్రమాదం ఉన్నందున వాటిని నివారించాల్సిన బాధ్యత స్థానిక సంస్థలపై ఉంది. ఈ క్రమంలో కుక్కల సంతతి నివారణకు పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు చేయడం, సంతాన నిరోధక ఇంజెక్షన్లు ఇచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.



రామలక్ష్మణ కూడలిలో సంచరిస్తున్న శునకాలు

బిల్లులు చెల్లించకపోవడంతో జాప్యం..

రెండేళ్ల కిందట ఖాజీపేట వద్ద రూ.25 లక్షలతో కుక్కలకు కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు చేసేందుకు జంతు జనన నియంత్రణ కేంద్రం(ఏబీసీ) నిర్మించారు. గతంలో బ్లూక్రాస్, గ్రీన్ మెర్సీ సంస్థలకు నగరపాలక సంస్థ శస్త్రచికిత్సలు చేసే బాధ్యతలు అప్పగించింది. ఆయా సంస్థలు ఆశించిన స్థాయిలో ఆపరేషన్లు చేయడంలో విఫలమయ్యాయి. గతేడాది ఆ బాధ్యతను హరియాణాకు చెందిన ఓ ప్రైవేటు సంస్థకు కట్టబెట్టారు. ఆ సంస్థ శస్త్ర చికిత్సలు చేస్తున్నప్పటికీ నగరపాలక సంస్థ బిల్లులు చెల్లింపులో జాప్యం చేయడంతో కొద్ది రోజుల నుంచి నిలిపివేసింది. దీంతో కుక్కల సంతతికి అడ్డుకట్ట వేసేందుకు ఆటంకం ఏర్పడింది.

శస్త్రచికిత్సలు కొనసాగిస్తాం..

డివిజన్లవారీగా కుక్కలకు శస్త్ర చికిత్సలు చేయిస్తున్నాం. సమస్య తీవ్రంగా ఉంటే ఫిర్యాదు చేయవచ్చు. ఆ ప్రాంతాల్లో తక్షణమే శునకాలను పట్టుకుని శస్త్రచికిత్సలు చేసి కోలుకున్నాక మళ్లీ విడిచిపెడతాం. గుత్తేదారు సంస్థకు బకాయిలు చెల్లించి.. సేవలు పునరుద్ధరించేలా చర్యలు తీసుకుంటాం. – పి.వి.వి.డి. ప్రసాదరావు, శ్రీకాకుళం నగరపాలక సంస్థ కమిషనర్



జడ్పీ పీఎఫ్ పర్యవేక్షకుడు సుందరరావుకు వినతి పత్రం అందజేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

పీఎఫ్ సమస్యలు పరిష్కరించరూ..

శ్రీకాకుళం నగరం, న్యూస్‌టుడే: ఉపాధ్యాయులకు సంబంధించిన పీఎఫ్ సమస్యలు పరిష్కరించాలని ఏపీటీఎఫ్ నాయకులు జడ్పీ పీఎఫ్ పర్యవేక్షకుడు డి.సుందరరావును శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. డీఈవో తిరుమల చైతన్యను ఆయన కార్యాలయంలో కలిసి ఉపాధ్యాయులకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈమేరకు ఆయనకు వినతిపత్రం అందించారు. సమాఖ్య నాయకులు ఎం.మదన్‌మోహన్, ఎస్వీ అనిల్‌కుమార్ బి.భీమారావు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం

జి.సిగడాం, న్యూస్‌టుడే: పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం కలుగుతుందని కూటమి నాయకులు అన్నారు. జి.సిగడాం మండలం దవళపేట గ్రామంలో శుక్రవారం స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా పరిసరాల పరిశుభ్రతపై అవగాహన ప్రదర్శన నిర్వహించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. మాజీ సర్పంచి కంచరాన సూరన్నాయుడు, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అండర్-19 క్రికెట్ పోటీలకు ఎంపిక



సుశాంత్



జున్నారావు

శ్రీకాకుళం అర్బన్, న్యూస్‌టుడే: అండర్-19 రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు జిల్లా క్రీడాకారులు నంబాళ్ల సుశాంత్, రాజాన జున్నారావు ఎంపికయ్యారు. ఇంటర్ జోనల్ పోటీల్లో సుశాంత్ అత్యధికంగా 341 పరుగులు సాధించి, జున్నారావు 9 వికెట్లు తీసి రాష్ట్ర జట్టులో చోటు దక్కించుకున్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులను ఎమ్మెల్యే గొండు శంకర్, జిల్లా క్రికెట్ సంఘ అధ్యక్ష, కార్యదర్శులు పుల్లెల శాస్త్రి, హసన్ రజా, కోశాధికారి కేవీఎం షైలానీ, మెంటార్ ఇలియాజ్ మహమ్మద్, తదితరులు అభినందించారు.

చట్టాలపై అవగాహన అవసరం

శ్రీకాకుళం అర్బన్, న్యూస్‌టుడే: వయోవృద్ధులు, విభిన్న ప్రతిభావంతుల చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. జిల్లా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సన్యాసినాయుడు మాట్లాడుతూ సీనియర్ సిటిజన్లకు జిల్లా కేంద్రంలో ప్రత్యేకంగా భవనం మంజూరు చేయాలని సూచించారు. ఆర్టీసీ కాంప్లెక్సులు, దేవాలయాల్లో ప్రత్యేకంగా క్యూలైన్ ఏర్పాటు చేయాలని.. వాహనాలకు ప్రత్యేకంగా ప్రదేశం కేటాయించాలని కోరారు. జడ్పీ సీఈవో ఆర్.వెంకట్రామన్, డీపీవో వెంకటేశ్వరరావు, డీఎంహెచ్‌వో డా.బి.మీనాక్షి, డీసీహెచ్ఎస్ డా.కల్యాణ్‌బాబు, రిమ్స్ సూపరింటెండెంట్ డా.షకీలా, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకురాలు కె.కవిత, ఆర్అండ్‌బీ ఎస్ఈ జాన్ సుధాకర్, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి సాయికుమార్, స్వీప్ సంస్థ అధ్యక్షుడు కొమ్ము రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

బధిరుల భావాలు అర్థం చేసుకోవాలి



గోడప్రతులు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, సీనియర్ సివిల్ జడ్జి సన్యాసినాయుడు తదితరులు

శ్రీకాకుళం అర్బన్, న్యూస్‌టుడే: బధిరుల భావాలు అర్థం చేసుకోవడానికి సంజ్ఞా భాషపై అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. శ్రీకాకుళం నగరంలోని జిల్లా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం అంతర్జాతీయ సంజ్ఞా భాషా దినోత్సవం నిర్వహించారు. కేకు కోసి పంపిణీ చేశారు. ఏటా సెప్టెంబరు 23న సంజ్ఞా భాషా దినోత్సవం నిర్వహిస్తున్నట్లు సంజ్ఞాభాషా అనువాదకురాలు ఉప్పలపాటి నర్మజ తెలిపారు. సీనియర్ సివిల్ జడ్జి సన్యాసినాయుడితో కలసి సంజ్ఞాభాష గోడప్రతులు ఆవిష్కరించారు. జిల్లా బధిరుల సంఘం ప్రతినిధులు ఉంగటి సురేష్, ఎస్.రవికిరణ్, ఎన్.దివ్యశ్రీ, ఎస్.దేవి తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభానికి నోచుకునేదెప్పుడో..

గ్రామాల్లో రైతులకు వ్యవసాయశాఖ సేవలు చేరువ చేయాలనే లక్ష్యంతో వైకాపా ప్రభుత్వ పాలనలో మతలబుపేటలో రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన రైతు భరోసా కేంద్రం ఇది. ప్రారంభానికి నోచుకోకపోవడంతో ఇలా నిరుపయోగంగా దర్శనమిస్తోంది. స్థానికులు ఇక్కడ మేకలు, పశువులు కట్టుకోవడానికి వినియోగించుకుంటున్నారు. ఈ విషయాన్ని పంచాయతీరాజ్‌శాఖ జేఈ సీహెచ్.మణికుమార్ వద్ద 'న్యూస్‌టుడే' వివరణ కోరగా పాఠశాల ఆవరణలో ఎలా నిర్మిస్తారని కొందరు కోర్టుకి వెళ్లడంతో ప్రారంభానికి నోచుకోలేదన్నారు. – న్యూస్‌టుడే, సరుబుజ్జిలి



ప్రమాదకరంగా భవనం



గార మండలం గొంటి ర.భ. రహదారిలో దీపావళి గ్రామం మలుపులో ఉన్న విశ్రాంతి భవనం సిమెంటు స్తంభం కొంత భాగాన్ని గుర్తు తెలియని ఆకతాయిలు ధ్వంసం చేయడంతో ప్రమాదకరంగా మారింది. ఇక్కడ స్థానికులతోపాటు ఆ మార్గంలో రాకపోకలు సాగించేవారు విశ్రాంతి తీసుకుంటారు. ఆ భవనం చుట్టూ ఉన్న రక్షణ గోడ శిథిలం కావడం, ప్రస్తుతం స్తంభం ప్రమాదకరంగా ఉండటంతో అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై ర.భ.ఏఈ గోవిందరావు వద్ద ప్రస్తావించగా పరిశీలించి పరిష్కారానికి చర్యలు చేపడతానన్నారు. – న్యూస్‌టుడే, గార

హిందువుల మనోభావాలను దెబ్బతీసిన జగన్

గుజరాతీపేట(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: తిరుమలకు వెళ్లే అన్యమతస్థులు ఆలయ సంప్రదాయం ప్రకారం డిక్లరేషన్‌పై సంతకం పెట్టి వేంకటేశ్వరస్వామిని దర్శించుకోవాలని.. దీనికి మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అతీతులు కారని తెదేపా శ్రీకాకుళం పార్లమెంట్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు పీఎంజే బాబు అన్నారు. తెదేపా జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వైకాపా పాలనలో దళితులపై జరిగిన హత్యలు, అత్యాచారాలు, ఇతర దురాగతాలపై జగన్ ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. తిరుమల లడ్డూను అపవిత్రం చేసి హిందువులు, భక్తుల మనోభావాలను దెబ్బతీశారని.. తిరిగి తెదేపాపై బురదజల్లే ప్రయత్నం చేయడాన్ని చూసి ప్రజలు అసహ్యించుకుంటున్నారని వ్యాఖ్యానించారు. ఐటీడీపీ జిల్లా అధ్యక్షుడు ప్రధాన విజయరాం మాట్లాడుతూ తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి వినియోగించారని అధికారుల నివేదికలు స్పష్టం చేస్తుంటే జగన్‌లో పశ్చాత్తాపం లేదని విమర్శించారు.

అవీ.. ఇవీ.. అన్నీ



బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

జి.సిగడాం, న్యూస్‌టుడే: బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని ఐ.సి.డి.ఎస్. సీడీపీవో పాపినాయుడు అన్నారు. జి.సిగడాం మండల కేంద్రంలో అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం బాల్య వివాహాలపై అవగాహన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహార ప్రదర్శన చేపట్టారు. అనంతరం జి.సిగడాం, సంతవురిటిల్లో ప్రదర్శనలు నిర్వహించారు. మండల విద్యాశాఖాధికారులు అరసాడ రవి, శ్రీనివాసరావు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన ఆబ్కారీ డీసీ

శ్రీకాకుళం నేరవార్తావిభాగం, న్యూస్‌టుడే: జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం ఎస్పీ మహేశ్వరరెడ్డిని ఆబ్కారీ శాఖ ఉప కమిషనర్ డి.శ్రీకాంత్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు.

కలెక్టర్‌ను కలిసిన డీఎఫ్‌వో

శ్రీకాకుళం నగరం: కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను ఆయన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం జిల్లా అటవీ శాఖ అధికారి (డీఎఫ్‌వో) వై.సంజయ్ మర్యాదపూర్వకంగా కలిశారు.

వివాహిత అదృశ్యంపై కేసు

ఎచ్చెర్ల(రణస్థలం), న్యూస్‌టుడే: మండలంలోని ఓ పంచాయతీకి చెందిన ఓ వివాహిత కనిపించడం లేదని జేఆర్‌పురం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్సై ఎస్.చిరంజీవి తెలిపిన వివరాల ప్రకారం.. రెండు రోజుల నుంచి తన భార్య కనపించడం లేదని భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలు నమెదు చేసి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇసుక లారీ పట్టివేత

ఎచ్చెర్ల(రణస్థలం), న్యూస్‌టుడే: మండలంలోని రామతీర్థాల కూడలిలో ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీని జేఆర్‌పురం పోలీసులు పట్టుకున్నారు. అనుమతులు లేకుండా విశాఖపట్నం ఇసుక తరలిస్తున్నట్లు గుర్తించి లారీని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

శుభ్రత పాటించండి

శ్రీకాకుళం నగరం, న్యూస్‌టుడే: శ్రీకాకుళం నగరంలోని వీధి వ్యాపారులు బండ్ల వద్ద డబ్బాలు ఏర్పాటు చేసుకుని వాటిలో వ్యర్థాలు వేయాలని.. పరిసరాల శుభ్రత పాటించాలని నగరపాలక సంస్థ ప్రజారోగ్యాధికారి పి.సుధీర్‌కుమార్ సూచించారు. శ్రీకాకుళం నగరంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల రహదారిలో శుక్రవారం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవ కార్యకమం నిర్వహించారు. ఆ ప్రాంతంలో తోపుడు బండ్లపై వ్యాపారం చేసుకునే వారికి పరిశుభ్రతకు సంబంధించిన అంశాలను వివరించారు. అందరి సహకారంతోనే స్వచ్ఛ శ్రీకాకుళం సాకారమవుతుందని ఆయన తెలిపారు.

విద్యార్థికి అభినందన

పొందూరు, న్యూస్‌టుడే: పొందూరు ఉన్నత పాఠశాల విద్యార్థి కె.దిలీప్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయులు డి.ఉదయ్ కుమార్, ఎస్.వి.రమణ, రజినీకుమార్ తెలిపారు. ఇటీవల కోడిరామ్మూర్తి స్టేడియంలో జరిగిన అథ్లెటిక్స్ పోటీల్లో 100 మీటర్ల పరుగు పందెంలో కె.దిలీప్ ఎంపికయ్యాడు. దీంతో అతడిని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.వెంకటరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

భాజపాను బలోపేతం చేద్దాం

జి.సిగడాం, న్యూస్‌టుడే: భాజపాను గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు వజ్జిపర్తి రఘురాం అన్నారు. మండలంలోని ఆనందపురం గ్రామంలో సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. భాజపా నాయకులు మీసాల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ఆర్థిక సాయం అందజేత



పాతర్లపల్లిలో చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు

ఎచ్చెర్ల(రణస్థలం), న్యూస్‌టుడే: ఇటీవల రణస్థలం మండలం పాతర్లపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్మాణంలో ఉన్న అసంపూర్తి భవనం కిటికీ శ్లాబు కూలి మృతి చెందిన విద్యార్థి వనుం కృష్ణంరాజు కుటుంబానికి ప్రభుత్వం ఆర్థిక సాయం అందించింది. పాతర్లపల్లిలోని విద్యార్థి తల్లిదండ్రులకు స్థానిక ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు రూ.5 లక్షల చెక్కును శుక్రవారం అందజేశారు. పార్టీ మండల అధ్యక్షుడు లంక శ్యామ్, గొర్లె లక్ష్మణరావు, కూటమి నేతలు పిసిని జగన్నాథం నాయుడు, గొర్లె సాయి, కోటపాలెం ధనుంజయ్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: మద్యం తాగడం మానాలని భార్య మందలించడంతో మనస్తాపానికి గురై ఈ నెల 23న గడ్డి మందు తాగిన మండలంలోని షేర్‌మహ్మద్‌పురం గ్రామానికి చెందిన సూరాడ రాజారావు(66) శ్రీకాకుళం సర్వజనాసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. నిత్యం మద్యం తాగుతుండటంతో భార్య రాజులమ్మ వద్దని మందలించడంతో ఇంటిలో ఉన్న గడ్డి మందు తాగి స్పృహ కోల్పోయాడు. వెంటనే గమనించిన కుటుంబ సభ్యులు శ్రీకాకుళం సర్వజనాసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈయనకు నలుగురు ఆడపిల్లలు ఉన్నారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై వి.సందీప్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాధిత కుటుంబానికి రూ.25 లక్షలు ఇవ్వాలి



శ్రీరామ్‌ను పరామర్శిస్తున్న ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు

గుజరాతీపేట(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: రణస్థలం మండలం పాతర్లపల్లి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో ఇటీవల చోటుచేసుకున్న ఘటనలో మృతి చెందిన విద్యార్థి కుటుంబానికి ప్రభుత్వం రూ.25 లక్షలు ఇవ్వాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.చందు, బి.హరీష్ డిమాండ్ చేశారు. ఇదే ఘటనలో గాయపడి ప్రభుత్వ సర్వజనాసుపత్రిలో చికిత్స పొందుతున్న కోరాడ శ్రీరామ్‌ను శుక్రవారం వారు పరామర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. క్షతగాత్రుడికి మెరుగైన వైద్యం అందించాలని.. మృతుడి కుటుంబ సభ్యులకు పరిహారం, ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరారు. ఇలాంటివి పునరావృతం కాకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. సమాఖ్య జిల్లా ఉపాధ్యక్షుడు సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

గుంతలో దిగిన సిలిండర్ల వాహనం



స్థానిక పెట్రోల్ బంక్ సమీపంలో శుక్రవారం అలికాం, బత్తిలి ప్రధాన రహదారి భారీ గుంతలో సిలిండర్లతో వెళ్తున్న వాహనం(వ్యాన్) ఒక్కసారిగా దిగడంతో అవి ఒక్కసారిగా కింద పడిపోయాయి. దీంతో కొద్దిసేపు వాహనాల రాకపోకలు నిలిచిపోగా ప్రజలు కూడా ఆ ప్రాంతానికి చేరుకోవడానికి భయపడ్డారు. సిలిండర్ల నుంచి ఎటువంటి లీకేజీలు లేకపోవడంతో పాటు భారీ ప్రమాదం తప్పడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ప్రతి రోజు ఈ మార్గంలో పలు సంఘటనలు చోటు చేసుకుంటున్నప్పటికీ సంబంధిత రోడ్లు, భవనాల శాఖ అధికారులు గుంతలు పూడ్చకపోవడంపై పలువురు విమర్శిస్తున్నారు. – న్యూస్‌టుడే, సరుబుజ్జిలి

జాగ్రత్తలు పాటించండి



రైతు సమస్యకు చరవాణిలో జవాబు చెబుతున్న కిరణ్

ఆమదాలవలస పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాలోని వివిధ మండలాల నుంచి 60 మంది రైతులు ఫోన్‌లో అడిగిన వ్యవసాయ సమస్యలకు వ్యవసాయ శాస్త్రవేత్త డా.కిరణ్ పరిష్కారాలు తెలియజేశారు. శుక్రవారం ఆమదాలవలసలోని కృషి విజ్ఞాన కేంద్రంలో రిలయన్స్ ఫౌండేషన్, కృషి విజ్ఞాన కేంద్రం సంయుక్తంగా ఆడియో కాన్ఫరెన్స్ కార్యక్రమం నిర్వహించాయి. ప్రస్తుతం వరిలో దోమ ఆశించే అవకాశాలు ఉన్నందున రైతులు తగిన జాగ్రత్తలు పాటించాలని ఆయన తెలిపారు. రిలయన్స్ ఫౌండేషన్ ప్రతినిధులు తిరుమలరావు పాల్గొన్నారు.

మురుగునీటితో ఇక్కట్లు



ఆమదాలవలస మండలం రామచంద్రాపురం గ్రామంలో ఇళ్ల ముందు మురుగునీరు నిల్వ ఉండటంతో స్థానికులు, దోమలు, దుర్వాసనతో ఇబ్బందులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో కాలువలో పూడిక పేరుకుపోవడంతో మురుగునీరు రహదారిపైకి చేరుతోందని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై ఎంపీడీవో వాసుదేవరావు స్పందిస్తూ వెంటనే కాలువలో పూడిక తొలగించి మురుగు నిల్వ లేకుండా చర్యలు చేపడతామన్నారు.

– న్యూస్‌టుడే, ఆమదాలవలస గ్రామీణం



తమ్మినేనికి అభినందన

శ్రీకాకుళం పార్లమెంటు నియోజకవర్గ వైకాపా పరిశీలకుడిగా తమ్మినేని సీతారాంనకు పార్టీ బాధ్యతలు అప్పజెప్పడంతో మున్సిపాలిటీ పరిధిలోని 23 వార్డుల పార్టీ శ్రేణులతో పాటు నాయకులు శుక్రవారం ఆయనను పట్టణంలోని స్వగృహంలో కలిసి అభినందనలు తెలిపారు. పార్టీ నాయకులు బొడ్డేపల్లి రమేష్‌కుమార్, దుంపల చిరంజీవి, దుంపల శ్యామ్, పొన్నాడ చిన్నారావు, అల్లంశెట్టి ఉమామహేశ్వరరావు, బొడ్డేపల్లి రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, ఆమదాలవలస పట్టణం